తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-02-డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 185 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# 2034కు ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం



### తెలంగాణను ప్రపంచ ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్

- గ్లోబల్ పెట్టుబడులను ఆహ్వానిస్తూ తెలంగాణ రైజింగ్ సమ్మిట్ సిద్ధం
- కేసీఆర్ పాలనలో వచ్చిన అప్పులను చెల్లిస్తూ అభివృద్ధి దారిలో రాష్ట్రం
- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అత్యధిక నష్టపరిహారం
- గ్రామాభివృద్ధికి సరైన నాయకులను ఎన్నుకోవాలని సీఎం పిలుపు
- మక్తల్ సభలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- రెండేళ్లలో రూ.1,000 కోట్ల నిధులు

మంత్రి శ్రీహరి భావోద్వేగం

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఎకానమీ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించే లక్ష్యంతో ముందుకుసాగుతున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలు, సేవ, వ్యవసాయ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామ ని చెప్పారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనకు సంబంధించి ప్రజా పాలన - విజయోత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.


మిగతా 2లో

### ఓఆర్ఆర్ పరిధిలో 27 స్థానిక సంస్థల విలీనానికి

# గవర్నర్ గ్రీన్‌సిగ్నల్

### జీహెచ్ఎంసీ విస్తరణకు మార్గం సుగమం

- 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లు జీహెచ్ఎంసీలో విలీనానికి మార్గం సుళువైంది
- పాత పాలక మండళ్ల తీర్మానాలపై గవర్నర్ అభ్యంతరం – ప్రభుత్వం సమాధానంతో క్లియర్
- జీహెచ్ఎంసీ, పురపాలక చట్టాల్లో సవరణలకు రెండు కొత్త ఆర్డినెన్స్‌లు
- మంత్రివర్గ ఆమోదం అనంతరం గ్రేటర్ హైదరాబాద్ విస్తరణ ప్రక్రియ వేగవంతం



### 133 వార్డులు, 5 సర్పంచ్ స్థానాలకు

# నామినేషన్లే లేవు

### తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో అసాధారణ పరిస్థితి



తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఐదు సర్పంచ్ స్థానాలతోపాటు, 133 వార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) తెలిపింది. అయితే ఇక్కడ నామినేషన్లే పడకపోవడంతో ఎన్నికలు జరిగే అవకాశం లేకుండా పోయింది. బుధవారం మధ్యాహ్నం నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన తర్వాత ఏకగ్రీవమయ్యే సర్పంచ్, వార్డు స్థానాలతోపాటు ఎంతమంది బరిలో ఉంటారనే దానిపై స్పష్టత వస్తుందని ఎన్నికల అధికారులు చెప్పారు. మొత్తంగా చూస్తే తొలివిడత ఎన్నికల్లో...

మిగతా 2లో



# హిల్ట్ పాలసీపై అపోహలు అవసరం లేదు

### సొంత భూములున్న పరిశ్రమలకే రుసుము వర్తిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

హిల్ట్ పాలసీలో భూ వినియోగ మార్పిడి రుసుము అనేది సొంత భూములు ఉన్న పరిశ్రమలకే వర్తిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. పారిశ్రామిక పార్కులు, ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను లీజుకు తీసుకుని ఉంటే.. హిల్ట్ పాలసీ వర్తించబోదని తెలిపారు. ఈ విషయం తెలిసీ బీఆర్ఎస్, బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న మూడు ప్రధాన పారిశ్రామిక పార్కుల్లో లీజులో ఉన్న ప్రభుత్వ భూములను అప్పనంగా

మిగతా 8లో



# కౌలు రైతు వీరన్న మృతిపై హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

కౌలు రైతులకు ఆత్మీయ భరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇవాళ వారి బతుకులకే భరోసా లేకుండా చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన కౌలు రైతు బానోత్ వీరన్న బలవన్మరణమే రేవంత్ సర్కారు మోసానికి నిలువెత్తు నిదర్శనమని సోమవారం ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారి లేక సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు ఒడిగట్టడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు.

మిగతా 8లో

# మహిళా సంఘాలకు మరో 448 బస్సులు



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

రాబోయే రోజుల్లో మహిళా స్వయం సహాయక సంఘాలకు మరిన్ని ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 152 ఆర్టీసీ అద్దె బస్సులను మండల మహిళా సమాఖ్యలు నిర్వహిస్తున్నాయి. మరో 448 అద్దె బస్సులను కూడా మహిళా సంఘాలకే అప్పగించే ప్రక్రియ చివరి దశలో ఉంది. ఈ నేపథ్యంలో సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి లేఖ రాశారు. మండల మహిళా సమాఖ్యలు 448 బస్సుల కొనుగోలు పూర్తిచేసి, వాటిని ఆర్టీసీకిఅద్దెకు ఇచ్చేందుకు

మిగతా 8లో

# బంగారు తెలంగాణ మాటలకే పరిమితం...
## 2047 విజన్‌తో కొత్త దిశలో రాష్ట్రం: పొన్నం తీవ్ర వ్యాఖ్యలు



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

కల్వకుంట్ల కవిత చెప్పినట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బంగారు తెలంగాణ విజన్ వారి ఇంటి నుంచి బయటకు రాకపోవచ్చునని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. కానీ ప్రపంచంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం అన్ని అంశాల ప్రణాళికలతో తెలంగాణ రైజింగ్ కార్యక్రమం

మిగతా 8లో


# ఖాజాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ భూమిపై 8 టవర్ల నిర్మాణం

### ప్రభుత్వానికి, బిల్డర్లకు హైకోర్టు నోటీసులు

- నాలుగు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం; విచారణ వాయిదా

ఖాజాగూడ చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఎనిమిది భారీ టవర్లు నిర్మిస్తున్నారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు బిల్డర్లకు సోమవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్‌లు దాఖలుచేయాలని స్పష్టం చేసింది. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్),

మిగతా 2లో



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# 2034కు ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



‘ఒకవైపు కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు చెల్లిస్తూనే, సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టాం. సంక్షేమంతో పాటు అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణమిస్తుంది.. మోసగిస్తే పాతాళానికి తొక్కుతుంది. తెలంగాణ రాష్ట్రం రావాలని 2009లో ఒక పెద్దాయన ఎంపీగా వలస వచ్చారు. తెలంగాణ వస్తే తమ కల్వకుర్తి, జూరాల, నెట్టెంపాడు, భీమా, పాలమూరు ప్రాజెక్టులు పూర్తవుతాయని.. తమ జీవితాలు మారతాయని ప్రజలు ఆయనకు అవకాశం కల్పించారు. కానీ తెలంగాణకు మొట్టమొదటి సీఎం అయిన ఆ పెద్ద మనిషి మన కష్టాలు తీర్చలేదు. సాగునీటి కోసం రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసినా సంగబండలో బండ పగులకొట్టడానికి రూ.12 కోట్లు ఇవ్వలేదు. మనకు సాగు, తాగునీరు కోసం ఆయన ఏనాడూ తాపత్రయ పడలేదు..’ అని పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు.

‘ప్రస్తుతం పాలమూరు ప్రజలు వారి బిడ్డను ఆశీర్వదించి సీఎం చేయడంతో మంత్రుల సహకారంతో కల్వకుర్తి ప్రాజెక్టు పూర్తి చేసుకున్నాం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల్లో భూములు కోల్పోయిన వారికి సహాయ, పునరావాసాన్ని (ఆర్అండ్ఆర్) నూటికి నూరు శాతం మంజూరు చేసి అమలు చేస్తాం. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి 69 జీఓ కోసం గొంతెత్తి మాట్లాడినా అప్పట్లో మన బాధను ఎవరూ వినలేదు. ఇప్పుడు కూడా కుట్రలు చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం రాగానే నారాయణపేట-కొడంగల్-మక్తల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు చేపట్టాలని ప్రయత్నిస్తే ..కేసులు వేసి ఏడాదిన్నరగా నిలిపివేయించారు.

కానీ మంత్రి శ్రీహరి రైతులతో మాట్లాడి 96 శాతం రైతులను ఒప్పించారు. దేశ చరిత్రలోనే అత్యధికంగా ఎకరాకు రూ.20 లక్షల నష్టపరిహారం మంజూరు చేశాం. ఈ ప్రాజెక్టు కోసం దండుకట్టి. గుంపు కట్టి రెండేళ్లలో పూర్తి చేసుకోవాలి. ఆ ప్రాజెక్టు గడువులోగా పూర్తి చేయకపోతే కాంట్రాక్టర్లు, అధికారుల వీపు విమానం మోత మోగించండి. రాతింబవళ్లు పని చేయించుకోండి. ఈ ప్రాంతాన్ని పైరు పంటలతో అభివృద్ధి చేసే బాధ్యత నాది..’ అని రేవంత్‌రెడ్డి చెప్పారు.



‘మీరు ఒక్క ఓటు వేస్తే ఇన్ని సమస్యలు తీరాయి. 2023లో ఊరు గెలిచాం. ఇప్పుడు రచ్చ గెలవాలి. ఇంకా పదేళ్లు ఉంటే అన్నీ చేయొచ్చు. ప్రభుత్వం కాళ్ల కింద కట్టె పెట్టే వారిని సర్పంచ్‌గా చేస్తే ఊరు దెబ్బతింటది. గ్రామ అభివృద్ధి కోసం ఆలోచించే వారికి ఓట్లు వేయాలి. ఎవరి మాటలో నమ్మి ఓట్లు వేస్తే గోస పడాల్సి వస్తుంది. ఈ ప్రభుత్వంతో కలిసి పనిచేసే వారిని సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి. మన సమస్య తెలిసి పరిష్కరించే వారిని ఎన్నుకోవాలి..’ అని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. సభకు ముందు మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులు, నేతలతో కలిసి వనపర్తి జిల్లా ఆత్మకూర్, నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీల పరిధిలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు.

సీఎం బహిరంగ సభలో మంత్రి వాకిటి శ్రీహరి భావోద్వేగానికి గురయ్యారు. సభలో మాట్లాడుతూ.. ‘ఎన్నికల్లో మెజార్టీ తక్కువ వచ్చినా బాధలేదు. నన్ను వ్యక్తిగతంగా దుమ్మెత్తిపోసినా పట్టించుకోలేదు. కానీ ఈరోజు మక్తల్ నియోజకవర్గానికి రూ.1,000 కోట్ల నిధులు ఇచ్చి అభివృద్ధికి అడుగులు వేయించిన సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన సమయంలో పెద్ద మనసుతో ప్రజలు వచ్చి పెద్ద ఎత్తున స్వాగతం పలకాల్సి ఉండే. కానీ మీ ప్రవర్తనతో మనసు గాయపడింది..’ అంటూ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ‘గతంలో ఎప్పుడైనా రెండేళ్లలో రూ.1,000 కోట్లు వచ్చాయా? ఒక్కసారి ఆలోచించండి. ఈ తప్పు మరోసారి చేయకండి..’ అని కోరారు.

## 133 వార్డులు, 5 సర్పంచ్ స్థానాలకు
# నామినేషన్లే లేవు

(మొదటి పేజీ తరువాయి)





4,236 గ్రామపంచాయతీల్లో (5 మినహాయించి) 4,231 సర్పంచ్ పదవులకు 22,330 నామినేషన్లు, 37,440 వార్డు స్థానాల్లో 37,179 (133 మినహాయించి) స్థానాలకు 85,428 నామినేషన్లు దాఖలైనట్టుగా స్పష్టత వచ్చింది.

నల్లగొండ జిల్లాలో 318 పంచాయతీలకుగాను అత్యధికంగా 1,950 మంది సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. సగటున ఒక్కో పదవికి 6 గురు పోటీ పడుతున్నారు. ములుగు జిల్లాలో అత్యల్పంగా నమోదయ్యాయి. ఇక్కడ 48 పంచాయతీలకు కేవలం 273 మంది మాత్రమే నామినేషన్లు వేశారు. రాష్ట్రంలోనే ఇది అత్యల్పం. వార్డు సభ్యుల నామినేషన్లలోనూ నల్లగొండ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఈ జిల్లాలోని 2,870 వార్డులకు 7,893 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఆ తర్వాత సంగారెడ్డిలో 4,311 మంది, సూర్యాపేటలో 4,122 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వార్డుల విషయంలోనూ ములుగు జిల్లా చివరిస్థానంలో ఉంది. ఇక్కడ 420 వార్డులకు కేవలం 959 మంది మాత్రమే., ఆ తర్వాతి స్థానంలో నారాయణపేట 1,183 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. మంచిర్యాల జిల్లాలోని 3 పంచాయతీలతోపాటు 34 వార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎస్ఈసీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. కొమురంభీమ్ జిల్లాలో ఒక సర్పంచ్ స్థానంతోపాటు 30 వార్డులకు, నిర్మల్ జిల్లాలో ఒక పంచాయతీతోపాటు 7 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. వికారాబాద్ జిల్లాలో 19, జనగామ జిల్లాలో 10 వార్డులకు, మరికొన్ని జిల్లాల్లో కూడా కొన్ని వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదని ఎస్ఈసీ తెలిపింది.

# ఖాజాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ భూమిపై 8 టవర్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)



మురళీనాయక్ భూక్యా (మహబూబాబాద్), కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి (నాగర్‌కర్నూల్)లు ఈ ఏడాది మేనెలలో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఈ ఆదేశాలు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామపరిధిలోని పాత సర్వే నెంబర్లు 119, 122, కొత్త సర్వే నెంబరు 27లోని 27.18 ఎకరాల ప్రభుత్వ భూమిలో బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్... డెవల్‌పమెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (డీఏజీపీఏ) పొందిన సోహిని బిల్డర్స్‌తో కలిసి 47 అంతస్తుల చొప్పున 8 భారీ టవర్లు నిర్మిస్తున్నారని పిటిషనర్లు ఆరోపించారు. వివాదంలో ఉన్న ఆ భూమిని రెవెన్యూ అధికారులు ఆ బిల్డర్లకు బదిలీ చేయడం చెల్లదని పేర్కొన్నారు. అధికారులు ప్రయివేటు వ్యక్తులతో కుమ్మక్కయి కబ్జాకు సహకరించారని ఆరోపించారు. దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేసినా లాభం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు సర్వే నెంబర్లు, లొకేషన్ వివరాలతో రెండోసారి ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. వివాదంలో ఉన్న భూమి విలువ దాదాపు రూ. 8 వేల కోట్లు ఉంటుందని, చాలా వేగంగా నిర్మాణాలు జరుగుతున్నందున అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ప్రభుత్వ అనుమతితోనే భూబదిలీ జరిగిందని, జీహెచ్ఎంసీ సహా అన్ని ప్రభుత్వ ఏజెన్సీల అనుమతులు తీసుకునే నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ప్రాజెక్టు ఇప్పటికే పూర్తికావచ్చిందని చెప్పారు. కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.

## ఓఆర్ఆర్ పరిధిలో 27 స్థానిక సంస్థల విలీనానికి
# గవర్నర్ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):





గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఓఆర్ఆర్ పరిధిలోని 20 పురపాలక సంఘాలు, 7 కార్పొరేషన్ల విలీనానికి సంబంధించిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోద ముద్ర వేశారు. విలీన ప్రక్రియకు సంబంధించి సోమవారం ఆర్డినెన్స్ గెజిట్ జారీ కావాల్సి ఉండగా, గవర్నర్ సాంకేతికపరమైన అంశాలను లేవనెత్తడంతో కాస్త ఆలస్యం జరిగిందని సమాచారం. అయితే 10 నెలల కిందట ఉన్న పాలక మండళ్లు చేసిన తీర్మానాలను పరిగణనలోకి తీసుకొని నవంబర్ 25వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరిస్తూ ఆమోదం తెలిపిన విషయం విదితమే.

విలీనం సందర్భంగా జీహెచ్ఎంసీ చట్టానికి, పురపాలక చట్టానికి సవరణలు అవసరమైన నేపథ్యంలో ఈ రెండు ఆర్డినెన్స్‌లను తీసుకొని రావాలని నిర్ణయించి ప్రభుత్వం ఆమోదం తెలి పింది. 20 మునిసిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లను గ్రేటర్‌లో విలీనం చేయడానికి జీహెచ్ఎంసీ పాలకమండలి ఆమోదం తెలిపింది. పదవీ కాలం ముగిసిన పాలక మండళ్లు గతంలో చేసిన తీర్మానాలు ఇప్పుడు చెల్లుబాటు కావన్న అభిప్రాయాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వ్యక్తం చేసినట్టు, దానికి ప్రభుత్వం నుంచి సమాచారం వెంటనే పంపించినట్టు తెలిసింది. దీంతో గవర్నర్ సంతకం

# టీపీసీసీ విస్తృత సమావేశం నేడు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):



టీపీసీసీ విస్తృత సమావేశం గాంధీభవన్‌లో మంగళవారం జరగనుంది. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అయితే కొత్తగా జిల్లా, పట్టణ కాంగ్రెస్ కమిటీలకు అధ్యక్షులుగా ఎన్నికైన వారు, ఇప్పటివరకు ఆ పదవులల్లో కొనసాగిన వారూ ఈ భేటీలో పాల్గొంటున్నారు. కొత్తగా జిల్లా, పట్టణ కాంగ్రెస్ కమిటీలకు అధ్యక్షులైన వారికి సీఎం రేవంత్ సమక్షంలో మహేశ్‌గౌడ్ నియామక పత్రాలు అందజేయనున్నారు. అలాగే ఇప్పటిదాకా ఆ పదవుల్లో కొనసాగిన వారిని సన్మానించనున్నారు. పంచాయతీలు సహా స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, రెండేళ్ల ప్రజాపాలనా విజయోత్సవాల నిర్వహణపై సీఎం రేవంత్, మీనాక్షి, మహేశ్‌గౌడ్‌లు దిశానిర్దేశం చేయనున్నారు.

సీఎం రేవంత్ వరుసగా రెండోరోజు మైదానంలో చెమటోడ్చారు. ఈనెల 13న ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రత్యేక మ్యాచ్‌లో మెస్సీ జట్టుతో సీఎం జట్టు తలపడనుంది. దీని కోసం ముఖ్యమంత్రి ఇప్పటి నుంచే ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆదివారం దాదాపు గంట పాటు ఫుట్‌బాట్ ప్రాక్టీస్ చేసిన ఆయన.. సోమవారం సాయంత్రం సైతం తన ప్రాక్టీస్ కొనసాగించారు. కాగా, మెస్సీతో మ్యాచ్ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం విజన్2047 క్రీడా విధానాన్ని ఆవిష్కరించనుంది.






# కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి 129 ఫిర్యాదుల స్వీకరణ

**మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, డిసెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 129 ఫిర్యాదులు స్వీకరించామని అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి తెలిపారు. డిఆర్ఓ హరిప్రియ తో కలిసి ఆయన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయడం తప్పనిసరి అని అధికారులు గుర్తు చేశారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యంగా తీసుకుని వెంటనే క్లియర్ చేయాలని, ప్రజా సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఇంకా, సిఎంఓ ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా వేగంగా పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వజ్రేష్ యాదవ్



**నాగారం, డిసెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం నాగారం మున్సిపాలిటీ 5వ వార్డ్ శ్రీనివాస్ నగర్ కాలనీలో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ పూజా కార్యక్రమం నేడు ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించారు.పేద కుటుంబాలకు గృహ సదుపాయాలు అందించడంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వజ్రేష్ యాదవ్ ప్రశంసిస్తూ, ముందునాళ్లలో మరింత మంది అర్హులైన కుటుంబాలకు ఇండ్లు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు.ఈకార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఛైర్మెన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# జిల్లాలో నూతన విత్తన చట్టం ముసాయిదాపై లబ్ధిదారులతో విస్తృత చర్చలు

అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి

**మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్, డిసెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కేంద్రంలో నూతన విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై సోమవారం రోజు విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ లబ్ధిదారులు, రైతులు, విత్తన కంపెనీల ప్రతినిధులు, డీలర్లు మరియు సంబంధిత ప్రయోజనకారులు పాల్గొన్నారు.ఈకార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సిములు యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్రామ్ రెడ్డి సహా వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో నూతన విత్తన చట్టం ముసాయిదా ముఖ్య అంశాలను వివరించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇందులో తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం పాల్గొన్న వారందరి సూచనలు, అభిప్రాయాలు సేకరించారు.అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ, నూతన చట్టం రూపకల్పనలో రైతుల హక్కులు, ప్రయోజనాలు పూర్తి స్థాయిలో కాపాడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ విధానాలు రైతులకు మరింత ఉపయోగకరంగా ఉండేలా అందరూ నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.


# మల్కాజ్‌గిరిలో పోలీస్ విస్తృత స్థాయిలో వాహన తనిఖీలు



**మల్కాజ్గిరి, డిసెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పరిధిలో ట్రాఫిక్ క్రమశిక్షణను బలోపేతం చేయడానికి రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి రోజూ విస్తృత స్థాయిలో వాహన తనిఖీలు జరుగుతున్నాయి. ఈ కార్యాచరణలో భాగంగా, మల్కాజ్గిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని రకాల వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఈ సందర్భంలో పోలీసులు మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు తమ వాహనానికి అవసరమైన పత్రాలు — ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. వాహనాలకు చట్టబద్ధమైన నెంబర్ ప్లేట్లు ఉండాలని, అనుమతి లేని మార్పులు చేయరాదని హెచ్చరించారు. ఇక ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం అత్యవసరమని తెలిపారు. ప్రజల భద్రత కోసం చేపడుతున్న ఈ తనిఖీల్లో ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# సత్తుపల్లి నుంచి వాడపల్లికి డీలక్స్ సర్వీస్ ప్రతి శుక్రవారం.!



◆ డిపో మేనేజర్ ఊటుకూరి సునీత

**సత్తుపల్లి, డిసెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రం వాడపల్లికి భక్తుల రాకపోకలకు సౌకర్యం కల్పిస్తూ ప్రతీ శుక్రవారం డీలక్స్ బస్సు నడపనున్నట్టు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఊటుకూరి సునీత తెలిపారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు సత్తుపల్లి బస్టాండ్ నుంచి డీలక్స్ బస్సు వాడపల్లికి బయలుదేరుతుంది. దర్శనానంతరం తదుపరి రోజు ఉదయం 8 గంటలకు వాడపల్లి నుంచి తిరుగు ప్రయాణం ఉంటుంది. ప్రయాణ చార్జీలను పెద్దలకు ₹630, పిల్లలకు ₹340గా నిర్ణయించామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సదుపాయం కల్పించామని, 68515 రిజర్వేషన్ కోడ్ ఉపయోగించి టికెట్లు పొందవచ్చని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9866619189, 9550767375, 9959225962 నంబర్లను సంప్రదించవచ్చని సునీత సూచించారు. సత్తుపల్లి పరిధిలోని భక్తులు ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎల్కతుర్తి పి హెచ్ సి పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలకు విశేష స్పందన




**ఎల్కతుర్తి, డిసెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి) పరిధిలోని పాఠశాలలు మరియు హాస్టళ్లలో ఈ నెలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించబడగా, వందలాది విద్యార్థులు ఆరోగ్య సేవలు పొందారు. పి హెచ్ సి వైద్య బృందం వరుసగా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి తగిన చికిత్సను అందించింది.

నవంబర్ 24వ తేదీన కేజీబీవీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో మొత్తం 250 మంది విద్యార్థుల్లో 118 మందికి చికిత్స అందించారు. నవంబర్ 25వ తేదీన తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన శిబిరంలో మొత్తం 473 మంది విద్యార్థుల్లో 186 మందికి వైద్య సేవలు అందించగా, నవంబర్ 28 మరియు డిసెంబర్ 1 తేదీల్లో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో మొత్తం 575 మంది విద్యార్థుల్లో 368 మంది చికిత్స పొందారు.

మూడు పాఠశాలల్లో నిర్వహించిన ఈ శిబిరాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై సమగ్ర పరీక్షలు చేసి, శారీరక బలహీనత, దృష్టి సమస్యలు, చర్మ సంబంధిత సమస్యలు, రక్తహీనత వంటి అనేక సమస్యలను గుర్తించారు. అవసరమైన మందులు, ఆరోగ్య సూచనలు విద్యార్థులకు అందించారు.

ఈ వైద్య శిబిరాలు పి హెచ్ సి ఎల్కతుర్తి మెడికల్ ఆఫీసర్ డా. ఎం. రాజశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించబడ్డాయి. శిబిరాల్లో డా. వర్ష మేడం, డా. భవాని మేడం, డా. అరవింద్ సర్, డా. సౌమ్య మేడం సేవలు అందించారు. ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. నందన్ దాస్, స్వరూపరావు, పుష్పలత మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది ముఖ్య పాత్ర పోషించారు. వైద్య శిబిరాల ద్వారా విద్యార్థుల ఆరోగ్య స్థితి అంచనా వేయటం, తక్షణ చికిత్స అందించటం, భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను నివారించే దిశగా సూచనలు ఇవ్వడం వంటి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయి. పాఠశాలల్లో ఇలాంటి శిబిరాలు నిర్వహించడం ద్వారా పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు తెలిపారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# సమన్వయంతో పనిచేయండి

## డీసీసీ అధ్యక్షుడికి మంత్రి పొంగులేటి పిలుపు

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నూతి సత్యనారాయణ గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం సంజీవ్ రెడ్డి భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకారం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి నూతన అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలందరికీ భరోసా ఇస్తూ... వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని అన్నారు. ఇదే విధంగా ఖమ్మం జిల్లాలో నూతన అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పార్టీకి అట్టిపెట్టుకుని ఉన్న నాయకులు, కార్యకర్తలందరికీ సమ ప్రాధాన్యత ఇచ్చి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డీసీసీ మాజీ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్ తదితర నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:** గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. అదే విధంగా అర్ధరాత్రి సమయాల్లో తీరుగుతున్న అనుమానిత వ్యక్తుల వివరాలు, వేలిముద్రలను పోలీస్ అధికారులు తనిఖీ చేస్తున్నారని తెలిపారు. విజబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేస్తేనే నేరాలు నియంత్రణలో వుంటాయాని, అందులో భాగంగానే అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు పోలీస్ గస్తీ పెంచి, పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, హోటళ్ళు, లాడ్జీలపై పోలీసులు సోదాలు నిర్వహించి అనుమానిత వ్యక్తుల పూర్తి వివరాలను సేకరించి, అనంతరం వారికి వెసులుబాటు కల్పిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు.అదేవిధంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి , రేషన్ బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణా కట్టడి చేసేలా చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసిన జిల్లా పోలీస్ యంత్రాంగం వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నారని తెలిపారు.





# మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు గానుగ ప్రారంభించిన మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో , డిసెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:** నేలకొండపల్లి మండలం, రాజేశ్వరపురం గ్రామం లోని మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 2025-26 సీజన్ చెరకు గానుగ సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు, కర్మాగార వ్యవస్థాపకులు నామ నాగేశ్వరరావు, చిన్నమ్మ దంపతులు ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని చెరకు గానుగ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రైతులను నామ ఆప్యాయంగా పలకరించి, వారి బాగోగులు గురించి తీసుకున్నారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ కర్మాగారం కొన్నప్పటి నుండి ఆర్థికంగా భారీ నష్టాలు వస్తున్నప్పటికీ ఒక రైతు బిడ్డగా రైతుల కష్టాలు తెలిసిన వాడిగా రైతన్నలకు అండగా ఉంటూ రైతు శ్రేయస్సు దృష్ట్యా కర్మాగారాన్ని నడిపిస్తున్నాము అని తెలిపారు. దేశంలోనే తొలి సారిగా రైతు సోదరుల కోరిక మేరకు టన్ను చెరుకు సరఫరా చేసిన రైతులకు అరకిలో పంచదార 202627 గానుగ సీజన్లో ఉచితంగా ఇస్తామని నామ ప్రకటించారు. ఈ కర్మాగారం అభివృద్ధికి మేనేజింగ్ డైరెక్టర్ నామ కృష్ణయ్య అహర్నిశలు కృషి చేస్తూన్నారని, భవిష్యత్తులో కూడా సిబ్బంది అంకిత భావంతో పని చేస్తూ ముందుకు సాగాలన్నారు. కర్మాగారాన్ని నమ్ముకొని దాని వెనుక వేలాది మంది రైతులు, వందలాది కుటుంబాల జీవనం ఉందని, అందుకే ఎన్ని కష్టాలు, నష్టాలూ వచ్చినప్పటికీ నిబద్ధతతోనూ ఈ కర్మాగారాన్ని ముందుకు తీసుకుపోతున్నామని నామ స్పష్టం చేశారు. రైతు సోదరులందరూ చెరకు విరివిగా సాగు చేసి కర్మాగారం అభివృద్ధికి తోడ్పడటంతో పాటు రైతు సోదరులు అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నామన్నారు. రైతులు అభివృద్ధి తనకు ముఖ్యమని, రైతులతోనే కర్మాగారం ముందుకు సాగుతుందని నామ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఏ చెక్కర కర్మాగారం ఇవ్వని విధంగా టన్నుకు అత్యధిక మద్దతు ధర ఇవ్వడంతో పాటు, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీకి కంటే మధుకాన్ చెక్కర కర్మాగారం అధిక సబ్సిడీ ఇవ్వడం విశేషంగా చెప్పుకోవచ్చు. దేశీయంగా అనేక రాష్ట్రాల్లో చెక్కర పరిశ్రమలు మూతబడుతున్నప్పటికీ తెలంగాణ బిడ్డగా చెరకు రైతుల సంక్షేమం కొరకు కర్మాగారాన్ని నడిపిస్తూ కృషి చేస్తున్న నామను రైతన్నలు పెద్ద ఎత్తున అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల చెరకు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని చెరకు గానుగ ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కెన్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్ రావు, ఏవిపి వై. కోటయ్య, డీజీఎం కేన్ అప్పారావు, ఏజీఎం హెచ్ఆర్ నరేష్, విభాగాధిపతులు, ఫ్యాక్టరీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులుతో పాల్గొని కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు.



# వేలేరు మండలంలో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

**వేలేరు, 01 డిసెంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల పరిధిలో కొనసాగుతున్న సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఏసీపీ ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. వేలేరు ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పీచర, మల్లికుదుర్ల గ్రామాల్లో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్లస్టర్లలో బందోబస్తు చర్యలు సమగ్రంగా ఉండాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రతి అంశాన్ని అధికారులందరూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఏసీపీ సూచించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుం



# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు...

## ఎస్ఐ వీరేందర్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;** సోషల్ మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని చింతకాని ఎస్ఐ వీరేందర్ హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నటలు చెప్పారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు హాని కలిగించవద్దన్నారు.



# పీచర సర్పంచ్‌గా బరిలో జల్తారి రేణుక

**వేలేరు, 01 డిసెంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలంలో కొనసాగుతున్న సర్పంచ్ ఎన్నికల సందర్భంగా పీచర గ్రామ సర్పంచ్ పదవి కోసం జల్తారి రేణుక w/o శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం ఆమె మాట్లాడుతూ, "గ్రామ అభివృద్ధి మా లక్ష్యం. పీచర గ్రామాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సర్పంచ్ పదవిని ఉపయోగించాలన్నదే మా అభిలాష. గ్రామ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తారని నమ్ముతున్నాను" అని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి పట్ల తనకున్న నిబద్ధతను తెలియజేస్తూ ప్రజల మద్దతు కోరినట్లు తెలిపారు.

# బెల్ట్ షాపులపై టాస్క్ ఫోర్స్ బృందాలు దాడులు

## ఏసీపీ టాస్క్ ఫోర్స్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;** గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని పలు గ్రామాలలో టాస్క్ ఫోర్స్ బృందాలు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.
పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కొణిజర్ల, రఘునాదపాలెం, చింతకాని, వి ఎం బంజారాలోని వివిధ ప్రదేశాలలో బెల్టు దుకాణాలపై ప్రత్యేక దాడి నిర్వహించి 35 వేల రూపాయల విలువ గల ఐ ఎం ఎఫ్ ఎల్ మద్యం సుమారు 30 లీటర్లు, 8.4 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించి నట్లు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వాట్సాప్‌లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు

ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్‌కుమార్



**ఎల్కతుర్తి, డిసెంబర్ 01 ( తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, దుష్ప్రచారం చేయడం, ప్రత్యర్థుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు నమోదు చేయడం వంటి చర్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ఎస్సై అక్కినపల్లి ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వాట్సాప్ గ్రూపుల్లో ఇతరులను రెచ్చగొట్టే పోస్టులు షేర్ చేసినా, అలాంటి పోస్టులకు ప్రోత్సాహం అందించినా నేరంగా పరిగణిస్తామని అన్నారు. ఇట్టి సందర్భాల్లో గ్రూప్ సభ్యులతో పాటు గ్రూప్ అడ్మిన్‌పై కూడా కేసులు నమోదు చేసే అవకాశముందని ఆయన తెలిపారు. ఇతరులకు హాని కలిగించే విధంగా దుష్ప్రచారం చేయడం చట్టపరంగా శిక్షార్హమని స్పష్టం చేశారు.

అదేవిధంగా ఎల్కతుర్తి మండలంలోని గ్రామాల్లో బెల్ట్ షాపులు నడుపుతున్న వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ చెప్పారు. చట్టవిరుద్ధమైన మద్యం విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

ఎన్నికల సమయంలో ప్రజలు శాంతి భద్రతలను కాపాడేలా వ్యవహరించాలని, చట్టం ఎవరినీ వదలదని ఎస్సై స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

# బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటు వెనుక మాజీ ప్రధాని హసీనా..!



బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణ శిక్ష వేసిన విషయం తెలిసిందే. కాగా 16 ఏళ్ల క్రితం బంగ్లాదేశ్‌లో జరిగిన రైఫిల్స్ తిరుగుబాటు వెనుక హసీనా ఉన్నట్లు ఆ ఘటనపై దర్యాప్తు చేస్తున్న కమిషన్ తాజాగా ఆరోపించింది. నాడు హసీనానే స్వయంగా తిరుగుబాటుకు ఆదేశించారని విచారణలో తేలినట్లు పేర్కొంది. 2009లో జరిగిన ఈ తిరుగుబాటు సమయంలో బంగ్లా ఆర్మీని బలహీనపర్చేందుకు భారత్ యత్నించిందని కమిషన్ ఆరోపించింది. దీనిపై ఆంగ్లపత్రిక ఏఎఫ్‌పీ వెలువరించిన కథనాన్ని కమిషన్ ప్రస్తావించింది. హసీనా రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత.. 2009లో బంగ్లాలో జరిగిన రెండు రోజుల తిరుగుబాటులో అగ్ర సైనిక అధికారులతో సహా 74 మంది మరణించారు.

గతేడాది హసీనా స్వదేశాన్ని వీడిన అనంతరం ఏర్పాటైన యూనస్ ప్రభుత్వం బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటుపై దర్యాప్తునకు ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ తిరుగుబాటుపై విచారణ చేసిన కమిషన్ తాజాగా తన నివేదికను విడుదల చేసింది. అందులో హసీనాపై ఆరోపణలు చేసింది. అప్పటి అవామీ లీగ్ ప్రభుత్వ నేతలు కూడా తిరుగుబాటులో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు పేర్కొంది. హసీనా ఆదేశాలతో మాజీ ఎంపీ ఫజ్లే నూర్ తపోష్ దీనిని ముందుండి నడిపించినట్లు వెల్లడించింది. ఆ సమయంలో జరిగిన హత్యలకు హసీనానే కారణమని ఆరోపించింది.

రైఫిల్స్ తిరుగుబాటు సమయంలో హసీనాకు మద్దతుగా నిలిచిన భారత్.. బంగ్లాలో అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నించినట్లు కమిషన్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఆ సమయంలో 921 మంది భారతీయులు ఢాకాకు వచ్చారని.. వారిలో 67మంది ఎక్కడ ఉన్నారో ఇప్పటికీ తెలియరాలేదని పేర్కొంది. వీటిపై భారత్ ఇంకా స్పందించలేదు.

విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటినుంచి ఆమె దిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. ఆమె పలు కేసుల్లో దోషిగా ఉన్నందున తిరిగి బంగ్లాకు అప్పగించాలని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం పలుమార్లు భారత్‌ను కోరింది.

# నేర పరిశోధనలో గూఢచారులుగా నల్లులు!

నల్లులు కనిపిస్తే వెంటనే ఎలా చంపాలని అందరూ ఆలోచిస్తుంటారు. మలేసియా శాస్త్రవేత్తలు మాత్రం వాటిని మచ్చిక చేసుకొని పరిశోధనలు చేస్తున్నారు. భవిష్యత్తులో అనేక నేర పరిశోధనల్లో ఇవి కీలక గూఢచారులుగా మారే అవకాశం ఉందని.. వాటి సాయంతో ఎన్నో కేసులను ఛేదించవచ్చని వీరు అంటున్నారు. నేరం జరిగిన చోట అప్పటికే నల్లులు ఉంటే బాధితులు లేదా అనుమానితులను గుర్తించేందుకు అవి సహాయపడతాయని ఇటీవల చేసిన పరిశోధనలో తేలినట్లు ఉత్తర పెనాంగ్‌లోని సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ మలేసియా బృందం పేర్కొంది. యూఎస్‌ఎం స్కూల్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్ ప్రయోగశాలలో తమ బృందం చాలా ఏళ్లు నల్లులపై అధ్యయనం చేసినట్లు శాస్త్రవేత్త అబ్దుల్ హాఫీజ్ అబ్ మజీద్ పేర్కొన్నారు. నల్లులు మానవుల నుంచి రక్తాన్ని పీల్చిన దాదాపు 45 రోజుల వరకు వారి డీఎన్‌ఏ నల్లుల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. రక్తాన్ని పీల్చకపోయినా నిందితులు వాడిన దుప్పట్లు, మంచాలు, దిండులపైన అవి తిరిగినా వారి డీఎన్‌ఏ నల్లుల్లో ఉంటుందన్నారు.

కొన్ని కేసుల్లో బాధితులు లేదా నిందితుల ఆచూకీ తెలియనప్పుడు వారుండే స్థలంలో నల్లులు ఉంటే వాటి నుంచి సేకరించిన డీఎన్‌ఏ ద్వారా ఎవరనేది గుర్తించవచ్చన్నారు. సాధారణంగా నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ఘటనా స్థలంలోని రక్తపు మరక నుంచి సేకరించిన డీఎన్‌ఏ ద్వారా నిందితులు, బాధితులకు సంబంధించిన కొన్ని వివరాలను గుర్తిస్తారు. అదేవిధంగా నేర స్థలంలో ఉన్న నల్లుల్లో ఉన్న డీఎన్‌ఏ ద్వారా బాధితులు లేదా నిందితుల జెండర్, కంటి రంగు, జుట్టు, చర్మం రంగు వంటి విషయాలు బయటపడతాయన్నారు. దోమలు, ఈగల మాదిరిగా నల్లులు ఎగరలేవని.. మనుషుల నుంచి ఒక బిందువు పరిమాణంలో రక్తాన్ని పీల్చగానే వాటి కడుపు నిండిపోతుందని శాస్త్రవేత్త తెలిపారు. దీంతో అవి ఎక్కువదూరం కదలలేకపోతాయన్నారు. అందువల్లే నిందితులను గుర్తించడంలో నల్లులు కీలకంగా మారుతాయని తెలిపారు. ఇవి దుప్పట్లు, దిండులలో దాక్కొని ఉంటాయి కాబట్టి, నిందితులకు సాక్ష్యాలను నాశనం చేసే అవకాశం కూడా ఉండదన్నారు.

# బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 31 మంది బైండోవర్

## సిఐ మధిర రూరల్ మధు



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;** గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరగాలంటే గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాలను కట్టడి చేయాలని మధిర రూరల్ సిఐ డి.మధు అన్నారు. సోమవారం మధిర రూరల్ పోలీస్ స్టేషన్ సందర్శించిన సిఐ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న 31 మంది దుకాణ యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మద్యం మత్తులో ఘర్షణ వాతావరణంతో పాటు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉంటుందని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లోని కిరాణా షాపుల్లో బెల్ట్ దందా సరికాదని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలలోని స్థానిక పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందస్తు సమాచారం తెలుసుకోవాలని అన్నారు. ఎన్నికలలో ఎలాంటి సంఘటన జరగకుండా పోలీస్ పెట్రోలింగ్ తో పాటు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# నాగులవంచ గ్రామ సర్పంచ్ పదవికి వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా కంభం మౌనిక నామినేషన్.....



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;** నాగులవంచ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున కంభం మౌనిక అధికారికంగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేయడం సందర్భంగా భారీగా గ్రామస్తులు పార్టీ కార్యకర్తలు హాజరై ఆమెకు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అభ్యర్థి కంభం మౌనిక మాట్లాడుతూ నాకు వైయస్ జగన్మోహన్ రెడ్డి పట్ల చిన్ననాటి నుంచే ఎంతో అభిమానం ఉంది ఆ అభిమానంతోనే సర్పంచ్ గా పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని ఆమె తెలియజేయడం జరిగింది. ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం నాకు ఎంతో సంతోషంగా ఉంది అని తెలిపారు. భవిష్యత్తులో గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు. జగన్ చేపట్టిన సంక్షేమ పథకాల మాదిరిగా గ్రామంలో మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి కృషి చేస్తాను అని, అనేక సంక్షేమ పథకాలతో నాగులంచ గ్రామ అభివృద్ధి కోసం పాటుపడతానని, ఛాయ శక్తుల పనిచేయటానికి సిద్ధంగా ఉంటానని, ఈ ఎన్నికలలో మీ యొక్క అమూల్యమైన ఓటును నాకు వేసి అత్యంత మెజార్టీతో గెలిపించాలని మౌనిక వివరించడం జరిగింది. ఈ నామినేషన్ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు. గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు, పార్టీ నాయకులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలంగాణ రాష్ట్ర ఎంపీజే ఉపాధ్యక్షులుగా షేక్. ఖాసిం

## ఘన సన్మానం




**ఖమ్మం బ్యూరో ,డిసెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;** సామాజిక న్యాయం, శాంతి స్థాపన కోసం కృషి చేస్తున్న ఎంపిజే - మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా కొత్త నిర్వాహక సభ్యులను ఎన్నుకుంది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రముఖ సామాజిక సేవకుడు షేక్ ఖాసిం ను సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం గర్వకారణమైందని ఎంపీజే సభ్యులు తెలిపారు.

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్ ఆధ్వర్యంలో 2025-2027 కాలానికి కొత్త సభ్యుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా షేక్ ఖాసిం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఎంపిజే ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కూడా సమర్ధవంతంగా పనిచేస్తున్నారు.

షేక్ ఖాసిం గత అనేక సంవత్సరాలుగా పేద మరియు వెనుకబడిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, అవకాశ సమానత్వం తీసుకురావాలన్న లక్ష్యంతో ఆయన ఎంపిజే కార్యకలాపాలకు నాయకత్వం వహిస్తున్నారని సభ్యులు పేర్కొన్నారు. ఆయన రాష్ట్ర స్థాయి ఎన్నిక పట్ల జిల్లా & రాష్ట్రస్థాయి నాయకులు, సామాజిక వేత్తలు, ఎంపీజే సభ్యులు విశేష హర్షం వ్యక్తం చేశారు. షేక్ ఖాసిం వంటి నాయకులు ముందుకు వస్తే - శాంతి & న్యాయ కోసం సామాజిక పోరాటం బలపడుతుంది అని పలువురు అభిప్రాయ పడ్డారు. షేక్ ఖాసిం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం ఎంపిజే సంస్థకు విశేష బలం చేకూరుస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జరిగిన ఘన సన్మాన కార్యక్రమంలో ఎంపీజే కార్యదర్శి బొగ్గవరపు సతీష్, కోశాధికారి ఎండి హకీమ్, ఉపాధ్యక్షులు యండి జహీర్, ఎండి రజబ్ అలీ, కార్యదర్శి ఎస్.డి. రఫీ, సభ్యులు ఎండి గౌస్, ఎండి రజాక్, ఎండి ఖలీమ్, ఎస్‌కే షరీఫుద్దీన్, ఎండి అహ్మద్, ఎస్ కె హుస్సేన్, ఎండి పాషా, షేక్ సైదులు, ఎస్.డి. గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# నింగిలోని లక్ష్యాన్ని నేలకూల్చిన డ్రోన్



రాడార్ మార్గనిర్దేశకత్వంలో ఒక యుద్ధవిమానం గగనతలంలోని మరో లక్ష్యాన్ని నేలకూల్చడం సంక్లిష్టమైన ప్రక్రియ. ఆధునిక గగనతల పోరాటంలో దీనికి ప్రత్యేకత ఉంది. ఇప్పటివరకూ మానవసహిత యుద్ధవిమానాలు ఈ విన్యాసాన్ని చేయగా.. తొలిసారిగా ఒక డ్రోన్ ఈ సత్తాను చాటింది. తుర్కియేకు చెందిన మానవరహిత యుద్ధవిమానం కిజిలెల్మా ఈ ఘనతను సాధించింది. ఈ పరిణామాన్ని కీలక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గగనతల పోరాట వ్యూహాలను మార్చేస్తుందని చెబుతున్నారు. సినోప్ ఫైరింగ్ రేంజ్ వద్ద సాగర జలాలపై ఈ పరీక్ష జరిగింది. ఇందులో కిజిలెల్మా డ్రోన్‌కు.. జెట్ ఇంజిన్‌తో నడిచే ఒక గగనతల లక్ష్యాన్ని నేలకూల్చే బాధ్యతను అప్పజెప్పారు. ఈ మానవరహిత యుద్ధవిమానంలో మురాద్ ఏఈఎస్‌ఏ రాడార్ ఉంది. ఇది చాలా దూరంలోని లక్ష్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించగలదు. వేగంగా కదులుతున్న లక్షిత డ్రోన్‌ను.. ఎలాంటి సాయం లేకుండానే కిజిలెల్మాలోని రాడార్ గుర్తించింది. ఆ వెంటనే కిజిలెల్మా తన రెక్కల కిందున్న గోక్డోగన్ బియాండ్ విజువల్ రేంజ్ (బీవీఆర్) క్షిపణిని ప్రయోగించింది. ఈ అస్త్రానికి గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉంది. రాడార్ మార్గనిర్దేశానికి అనుగుణంగా ఇది లక్షిత డ్రోన్ వద్దకు దూసుకెళ్లి, దాన్ని నేలకూల్చింది. ఈ క్రమంలో టాయ్‌గన్ టార్గెటింగ్ వ్యవస్థ దీనికి ఉపయోగపడింది. ప్రయోగ సమయంలో కిజిలెల్మా వెంట ఐదు ఎఫ్15 యుద్ధవిమానాలు పయనించాయి. కిజిలెల్మా డ్రోన్ 'రాడార్ సిగ్నేచర్' చాలా తక్కువ. అందువల్ల ప్రత్యర్థి రాడార్లు అంత సులువుగా దాన్ని గుర్తించలేవు. మరోవైపు ఈ సాయుధ డ్రోన్.. చాలా దూరంగా ఉండగానే శత్రు యుద్ధవిమానాలను గమనించగలదు. అందువల్ల తాను ప్రత్యర్థి కంటపడటానికి ముందే ఇది ప్రత్యర్థిని గుర్తిస్తుంది. ఫలితంగా దాడులు చేయడంలోను, శత్రు దాడులను తిప్పికొట్టడంలో పైచేయి ప్రదర్శిస్తుంది. ఈ డ్రోన్‌లో శక్తిమంతమైన ఇంజిన్ ఉంది. పెను వేగంతో దూసుకెళుతూ కూడా అద్భుత విన్యాసాలు చేయగలదు. ఇందులో కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగించారు. అందువల్ల అది విమానవాహక నౌకలపై కూడా సొంతంగా టేకాఫ్, ల్యాండింగ్ నిర్వహించగలదు. తాజా పరీక్షతో ఇది గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలతోపాటు నేలపైన కూడా దాడులు చేయగలదని వెల్లడైంది. కిజిలెల్మాను బేరక్తర్ సంస్థ అభివృద్ధి చేసింది. ఇది అంతర్జాతీయంగా అగ్రశ్రేణి డ్రోన్ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. 2023, 24 సంవత్సరాల్లో ఇది ఎగుమతుల ద్వారా 180 కోట్ల డాలర్లను ఆర్జించింది. ఇది వరుసగా గత నాలుగేళ్లలో తుర్కియేలో అగ్రశ్రేణి రక్షణ ఎగుమతిదారుగా నిలిచింది. తాజా పరిణామం భారత్‌కు చాలా కీలకం. మన దేశానికి పొరుగున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు తుర్కియే నుంచి భారీగా డ్రోన్లను దిగుమతి చేసుకుంటుండటమే ఇందుకు కారణం. ముఖ్యంగా బేరక్తర్ డ్రోన్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నాయి. ఈ పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది. తుర్కియే అభివృద్ధి చేస్తున్న డ్రోన్లలో సాంకేతిక పురోగతి, ఆ దేశంతో పాక్, బంగ్లాదేశ్‌లకున్న మైత్రిని బేరీజు వేసుకొని భవిష్యత్ డ్రోన్ల రూపకల్పనకు సిద్ధమవుతోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నవంబర్‌లో నెమ్మదించిన జీఎస్టీ వసూళ్లు




దేశంలో వస్తు సేవల పన్ను వసూళ్లలో స్వల్ప వృద్ధి మాత్రమే నమోదైంది. నవంబర్ నెలలో స్థూలంగా రూ.1,70,276 కోట్లు వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే కేవలం 0.7 శాతం మాత్రమే వసూళ్లు పెరిగాయి. గతేడాది నవంబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లుగా ఉంది. దేశీయంగా జీఎస్టీ రెవెన్యూ తగ్గడం ఈ పరిస్థితి కారణం. సెప్టెంబర్ 22న సుమారు 375 వస్తువులపై కేంద్రం జీఎస్టీని తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో దేశీయంగా వచ్చే జీఎస్టీ ఆదాయం 2.3 శాతం క్షీణించి రూ.1.24 లక్షల కోట్లకు పరిమితమైంది. అదే సమయంలో దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో 10.2 శాతం వృద్ధితో రూ.45,976 కోట్లకు పెరిగింది.

# A320కి ఎండకు ఎదురెళ్లే కొత్త శక్తి.. 6,000 విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్!




సోలార్ రేడియేషన్ కారణంగా ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో తలెత్తిన సాంకేతిక సమస్య పరిష్కారం దాదాపు కొలిక్కి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 6,000 విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ను పూర్తి చేసినట్లు కంపెనీ సోమవారం ప్రకటించింది. మరో 100 విమానాల్లో దీన్ని పూర్తి చేయాల్సి ఉందని తెలిపింది. దీంతో ఏ320 రకం విమానాలన్నీ ఎప్పటిలా సాధారణ కార్యకలాపాలకు అందుబాటులోకి వచ్చాయని పేర్కొంది. ఈ సాంకేతిక సమస్య కారణంగా ఇబ్బంది పడ్డ ప్రయాణికులకు, విమానయాన సంస్థలకు ఈ సందర్భంగా ఎయిర్‌బస్ క్షమాపణలు చెప్పింది.

ఇండియాలో ఏ320 రకం విమానాలు 338 ఉన్నాయి. వీటన్నింటి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ప్రక్రియ పూర్తయినట్లు ఆదివారం డీజీసీఏ వెల్లడించింది. ఇండిగో, ఎయిర్ ఇండియా, ఇండియా ఎక్స్‌ప్రెస్ వద్ద ఈ విమానాలు ఉన్నాయి. సూర్యుడి వేడి కారణంగా ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ వ్యవస్థ దెబ్బతింటున్న విషయం తెలిసిందే. ఫలితంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఇటీవల ఎయిర్‌బస్‌కు చెందిన జెట్ బ్లూ ఏ320 అనే విమానానికి ఇలాంటి పరిస్థితే ఎదురైంది. దీంతో ఈ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసుకోవాలని ఎయిర్‌బస్ ఇటీవల కీలక హెచ్చరికలు జారీ చేసింది.

సాఫ్ట్‌వేర్ దెబ్బతినడానికి తీవ్రమైన సోలార్ రేడియేషన్ కారణమని అధికారులు తేల్చారు. ఏ320 మోడల్ విమానాల్లో నియంత్రణకు సంబంధించిన కీలక డేటా దెబ్బతిందని, అందువల్ల సాఫ్ట్‌వేర్‌లో మార్పులు సూచిస్తున్నామని ఎయిర్‌బస్ పేర్కొంది.

# AI ఇంటిగ్రేషన్‌తో మెటా స్మార్ట్‌గ్లాసెస్.. 12MP కెమెరా.. 48 గంటల బ్యాటరీ



కృత్రిమ మేధ అనుసంధానంతో వచ్చిన ఓక్లీ మెటా స్మార్ట్ గ్లాసెస్ ఇప్పుడు భారత మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ప్రముఖ క్రీడా పరికరాల తయారీ సంస్థ ఓక్లీ భాగస్వామ్యంతో మెటా ఈ గ్లాసెస్‌ను తీసుకొచ్చింది. వీటితో హైక్వాలిటీ వీడియోలు, ఫొటోలు తీయొచ్చు. దీనిలోని వాయిస్ అసిస్టెంట్ ద్వారా అనేక పనులు సులభంగా చేసేయొచ్చు. మెటా AI సపోర్ట్‌తో పనిచేసే ఓక్లీ మెటా HSTN గ్లాసెస్ ప్రారంభ ధర రూ.41,800. ఈ ధర క్లియర్, ప్రిజమ్ వేరియంట్లకు వర్తిస్తుంది. ప్రిజమ్ పోలరైజ్డ్ లెన్స్ ఉన్న మోడల్ ధర రూ.44,200. ప్రిజమ్ ట్రాన్సిషన్ లెన్స్ ఉన్న గ్లాసెస్‌ను రూ.47,600కు కొనుగోలు చేయొచ్చు. దేశంలోని అన్ని ప్రముఖ ఆప్టికల్, ఐవేర్ రిటైలర్లు, సన్‌గ్లాస్ స్టోర్లలో ఇవి విక్రయానికి అందుబాటులో ఉంటాయి. ఓక్లీ మెటా గ్లాసెస్‌లో 12 మెగాపిక్సెల్ కెమెరా ఉంది. ఇది 3కే వీడియో రిజల్యూషన్‌లో సెకనుకు 30 ఫ్రేమ్‌ల వేగంతో వీడియోలను రికార్డు చేయగలదు. వీడియో రికార్డింగ్ కోసం ఇందులో స్టాండర్డ్, స్లో మోషన్, హైపర్‌లాప్స్ వంటి మోడ్‌లు ఉన్నాయి. వినియోగదారులు 3024 x 4032 పిక్సెల్స్ రిజల్యూషన్‌లో ఫొటోలు కూడా తీయొచ్చు. వీటిలో ఉన్న ప్రత్యేక పెంటా మైక్రోఫోన్.. ఆడియోను స్పష్టంగా రికార్డు చేస్తుంది. కాల్స్ మాట్లాడుకోవడానికి, పాటలు వినడానికి ఓపెన్ ఇయర్ స్పీకర్లను అమర్చారు. ఇన్‌స్టాగ్రామ్ లాంటి మెటా యాప్‌ల ద్వారా ఫస్ట్ పర్సన్ లైవ్‌స్ట్రీమింగ్ చేసే సౌలభ్యం కూడా ఈ గ్లాసెస్‌తో ఉంది. ఈ గ్లాసెస్‌లో 32GB ఇన్‌బిల్ట్ స్టోరేజ్ ఉంది. ఇది 30 సెకన్ల నిడివి ఉన్న 100 వీడియోలకు, 1,000 కన్నా ఎక్కువ ఫొటోలకు సరిపోతుందని కంపెనీ తెలిపింది. 'హే మెటా' అనే సింపుల్ వాయిస్ కమాండ్ సహాయంతో మెటా AI అసిస్టెంట్‌ను యాక్టివేట్ చేయొచ్చు. దీని ద్వారా వాతావరణ సమాచారం, ప్లానింగ్, వంట చిట్కాలు లాంటివి అడగొచ్చు. యాపిల్ మ్యూజిక్, స్పాటిఫై లాంటి వాటితో ఇది అనుసంధానం కావడంతో పాటలను కూడా వినొచ్చు. ఒక్కసారి పూర్తిగా ఛార్జింగ్ చేస్తే ఈ స్మార్ట్ గ్లాసెస్ దాదాపు ఎనిమిది గంటల వరకు పనిచేస్తాయి. వీటితో పాటు రీఛార్జ్ చేయగలిగే కేస్ కూడా వస్తుంది. దీని నుంచి గ్లాసెస్‌ను ఛార్జ్ చేయడం ద్వారా మొత్తం 48 గంటల వరకు వాడుకోవచ్చు.

# ప్రభుత్వ బ్యాంకులు నాలుగేనా?..
## మెగా విలీనం దిశగా కేంద్రం అడుగులు!

ప్రభుత్వరంగ బ్యాంకుల మలి విడత విలీన ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఐదేళ్ల క్రితం 27గా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులను 12కు తగ్గించింది. ఇప్పుడా సంఖ్యను నాలుగుకు తగ్గించాలని చూస్తోంది. అన్నీ కుదిరితే 202627 ఆర్థిక సంవత్సరానికల్లా ఈ విలీన ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. విలీనం అనంతరం ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతో పాటు కెనరాయూనియన్ బ్యాంక్ విలీనం తర్వాత ఏర్పడే మరో బ్యాంక్ మాత్రమే మిగలనున్నాయి. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'మనీకంట్రోల్' ఓ కథనాన్ని ప్రచురించింది.




ప్రస్తుతం ఈ అంశం ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతానికి బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేయడం, నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించడం, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా బ్యాంకులను తీర్చిదిద్దడం వంటి అంశాలపై ఈ శాఖ పనిచేస్తోందని తెలిసింది. తొలుత చిన్న బ్యాంకులను కాస్త పెద్ద బ్యాంకులతో విలీనం చేసి.. ఆపై దేశీ వృద్ధి అవసరాలకు అనువైన బ్యాంకులుగా తీర్చిదిద్దడం ఈ ప్రణాళిక ఉద్దేశమని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తి తెలిపారు. మొత్తంగా పీఎస్‌బీలను నాలుగుకు తగ్గించడం ప్రణాళికలో భాగమని పేర్కొన్నారు.

ప్రభుత్వరంగ బ్యాంకులైన కెనరా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను విలీనం చేసి అతిపెద్ద బ్యాంకుగా తీర్చిదిద్దనున్నారు. మనుగడలో ఉండే అతిపెద్ద బ్యాంకుల జాబితాలో ఈ బ్యాంక్ కూడా ఉండనుంది. ఇక ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్ కలిసి విలీనం చేసి ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీఓబీలో విలీనం చేయాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇవి కాకుండా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సంస్థలు.. ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీఓబీల్లో విలీనం కానున్నాయి. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు గురించి ఇప్పటి వరకు ఏ నిర్ణయమూ తీసుకోలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై నాలుగింటిలో ఏదో ఒక దాంట్లో విలీనం చేసే అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం ఈ ప్రణాళిక ఆర్థిక మంత్రిత్వ శాఖ వద్ద ఉంది. ఆర్థిక శాఖ ఆమోదం అనంతరం క్యాబినెట్‌కు, ప్రధాని మంత్రి కార్యాలయానికి చేరనుంది. దీంతో పాటు మార్కెట్ పరమైన ఇబ్బందులు రాకుండా సెబీ లేవనెత్తే అంశాలనూ పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వ బ్యాంకుల విలీనం, భారీ బ్యాంకుల అవసరం అంశం పలుమార్లు ప్రస్తావనకొచ్చింది. భారత్‌కు ప్రపంచస్థాయి బ్యాంకులు అవసరమంటూ ఇటీవల నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించడమూ ఇందులో భాగమే. ప్రస్తుతం గ్లోబల్ 100 బ్యాంకుల జాబితాలో భారత్ తరఫు నుంచి ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాత్రమే చోటు దక్కించుకున్నాయి.

# రికార్డు గరిష్ఠాల నుంచి నష్టాల్లోకి సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఉదయం జీడీపీ గణాంకాలు ఇచ్చిన ఉత్సాహంతో జీవనకాల గరిష్ఠాల వద్ద ట్రేడైన సూచీలు.. తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. ముఖ్యంగా రూపాయి విలువ మరింత కనిష్ఠానికి చేరడం, వాణిజ్య ఒప్పందంపై ఇంకా స్పష్టత రాకపోవడం వంటివి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. రియల్టీ, ఫార్మా, హెల్త్‌కేర్, కన్జూమర్ డ్యూరబుల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ వంటి ప్రధాన స్టాక్స్ సూచీలను కిందకు లాగాయి.



సెన్సెక్స్ ఉదయం 86,065.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,706.67) రికార్డు గరిష్ఠాల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 86,159.02 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఉదయం కాసేపు లాభాల్లో ట్రేడయిన సూచీ.. క్రమంగా నష్టాల్లోకి జారుకుంది. 85,489.65 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 64.77 పాయింట్ల నష్టంతో 85,641.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 27.20 పాయింట్ల నష్టంతో 26,175.75 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.56గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ట్రెంట్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్ స్టాక్స్ నష్టాల్లో ముగియగా.. టీఎంపీవీ, మారుతీ సుజుకీ, బీఈఎల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,257 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# అదానీ గ్రూప్‌లో ఎల్ఐసీ పెట్టుబడుల్లో
## మా జోక్యం లేదు: నిర్మలా సీతారామన్

అదానీ గ్రూప్ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడుల విషయంలో తమ జోక్యం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. తమ శాఖ తరఫున ఎలాంటి సలహాలు గానీ, ఆదేశాలు గానీ ఇవ్వలేదని స్పష్టంచేశారు. పెట్టుబడుల విషయంలో ప్రామాణిక నిర్వహణ ప్రక్రియను అనుసరించి ఎల్ఐసీనే పెట్టుబడులపై నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడుల విషయంలో ఎల్ఐసీకి ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయంటూ అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్ట్ అక్టోబర్ నెలలో ఓ కథనం వెలువరించింది. దీన్ని ఎల్ఐసీ తోసిపుచ్చింది. పెట్టుబడులు అనేవి తమ సొంత నిర్ణయమని పేర్కొంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ బదులిచ్చారు. ఎల్ఐసీ పెట్టుబడులపై సొంతంగా నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఐఆర్‌డీఏఐ, ఆర్‌బీఐ, సెబీ నిబంధనలు అనుసరించి ఈ పెట్టుబడులపై ఈ నిర్ణయాలు ఉంటాయని చెప్పారు.



ఎల్ఐసీ బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈలో లిస్టయిన టాప్500 కంపెనీల్లో ఎల్ఐసీకి పెట్టుబడులు ఉన్నాయని నిర్మలా సీతారామన్ అన్నారు. వీటిల్లో పెద్ద పెద్ద కంపెనీల్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు ఉన్నాయని పేర్కొన్నారు. 2025 సెప్టెంబర్ 30 నాటికి నిఫ్టీ 50 కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబుల విలువ రూ.4.30 లక్షల కోట్లు అని, మొత్తం పెట్టుబడుల్లో 45.85 శాతం వాటాకు సమానమని పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో రూ.40,901.38 కోట్లు, ఇన్ఫోసిస్‌లో రూ.38,846.33 కోట్లు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో రూ.31,926.89 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రూ.31,664.69 కోట్లు, హిందుస్థాన్ యూనిలీవర్‌లో రూ.30,133 కోట్లు చొప్పున పెట్టుబడులు ఉన్నాయని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు అత్యధికంగా రూ.49,149.14 కోట్లు డెట్ రూపంలో ఇచ్చిందని పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు రూ.14,012.34 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్‌కు రూ.13,435 కోట్లు, శ్రీరామ్ ఫైనాన్స్ రూ.11,075 కోట్లు, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్‌కు రూ.9625.77 కోట్లు చొప్పున రుణాలు ఇచ్చిందని తెలిపారు.

అదానీ గ్రూప్ కంపెనీల్లో అత్యధికంగా అదానీ టోటల్ గ్యాస్‌లో రూ.8,646.82 కోట్లు పెట్టుబడులు ఉన్నాయని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఎల్ఐసీ ఈ పెట్టుబడుల్లో ఈ కంపెనీ 25వ స్థానంలో ఉందన్నారు. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.8,470.60 కోట్లు (27వ స్థానం), అంబుజా సిమెంట్స్ రూ.5,787.73 కోట్లు (40వ స్థానం), ఏపీ సెజ్ రూ.5,681.10 కోట్లు (43వ స్థానం), అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.3729.68 కోట్లు (65వ స్థానం), అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ 3,486.10 (71వ స్థానం), ఏసీసీలో రూ.2,856.82 కోట్లు (81వ స్థానం) పెట్టుబడులు ఉన్నాయని పేర్కొన్నారు. రూ.41 లక్షల కోట్ల మేర ఆస్తులతో దేశంలోనే అతిపెద్ద సంస్థాగత మదుపరిగా ఎల్ఐసీ ఉందని పేర్కొన్నారు. వివిధ కంపెనీల్లో రూ.15.6 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఉన్నాయని తెలిపారు. ఎల్ఐసీ ప్రభుత్వ బాండ్లలోనూ, కార్పొరేట్ బాండ్లలోనూ పెట్టుబడులు పెడుతూ ఉంటుందని నిర్మలా సీతారామన్ వివరించారు.

# అధిక పింఛనుకు 17.49 లక్షల దరఖాస్తులు.. 99%పరిష్కారం!

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ద్వారా అధిక పింఛను కోసం వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 99 శాతం పరిష్కారమయ్యాయి. ఈ విషయాన్ని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే సోమవారం పార్లమెంటులో వెల్లడించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఈ ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు. అధిక పింఛను కోసం పెన్షనర్లు, సభ్యుల నుంచి మొత్తం 17.49 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 15.24 లక్షల అప్లికేషన్లను యజమానులు 2025 జనవరి 31 వరకు EPFOకు పంపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 4,27,308 మందికి డిమాండ్ లెటర్లు జారీ చేశారు. అయితే, ఆ తరువాత 34,060 కేసులు అనర్హమని తేలాయి. దీనికి ముఖ్య కారణం, డిమాండ్ చేసిన మొత్తాన్ని జమ చేయకపోవడమే. మొత్తం దరఖాస్తుదారుల్లో 2,33,303 మంది వారి సమ్మతిని తెలియజేశారు. వీరిలో 96,274 మంది ఉద్యోగాల్లో కొనసాగుతుండగా 1,37,029 మంది ఇప్పటికే పదవీ విరమణ చేశారు. రిటైర్ అయిన వారిలో 1,24,457 మందికి పెన్షన్ చెల్లింపు ఉత్తర్వులు (PPO) ఇప్పటికే జారీ అయ్యాయి. మరో 12,572 PPOలు తుది దశలో ఉన్నాయని మంత్రి సభకు తెలిపారు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నిర్వహించే ఉద్యోగుల పెన్షన్ పథకం 1995 కింద పెన్షన్ లెక్కించడానికి, ఒక ఉద్యోగి వేతనాన్ని నెలకు రూ.15,000కు పరిమితం చేశారు. దీని అర్థం, ఎవరైనా ఉద్యోగి రూ.15,000 కంటే ఎక్కువ జీతం తీసుకున్నా, ఆ మొత్తంలో 8.33 శాతం (యజమాని వాటా) మాత్రమే పెన్షన్ ఫండ్‌కు జమ అవుతుంది. దీంతో, అధిక వేతనాలు పొందే వారికి కూడా తక్కువ పెన్షన్ వచ్చేది. ఈ పరిమితిని సవాలు చేస్తూ, ఉద్యోగులు తమ వాస్తవ వేతనంపై అంటే, పరిమితి లేకుండా మొత్తం జీతంపై పెన్షన్ ఫండ్‌కు అధికంగా వాటా చెల్లించడానికి, తద్వారా పదవీ విరమణ తర్వాత అధిక పింఛను పొందడానికి అనుమతించాలని ఉద్యోగులు కోరుకున్నారు. ఈ అంశమే వివాదానికి మూలమైంది. ఈ వివాదంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, 2022 నవంబర్ 4న కీలక తీర్పు ఇచ్చింది. ఉద్యోగులు, వారి యజమానులు సంయుక్తంగా దరఖాస్తు చేసుకుంటే అధిక వేతనంపై (రూ.15,000 పరిమితిని పరిగణలోకి తీసుకోకుండా) పెన్షన్ ఫండ్‌కు వాటాలు చెల్లించడానికి అనుమతించాలని సుప్రీంకోర్టు EPFOను ఆదేశించింది. ఈ తీర్పు ద్వారా, గతంలో పరిమితి వల్ల తక్కువ పింఛను పొందుతున్న లేదా పొందబోతున్న ఉద్యోగులకు, అధిక వేతనంపై పూర్తి వాటా చెల్లించే అవకాశం లభించింది. దీంతో తమ పదవీ విరమణ తర్వాత మెరుగైన పెన్షన్ పొందేందుకు వీలు కలిగింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# అన్ని రోగాలకి ఒక్కటే పరిష్కారం..



గ్రీన్ టీ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే శక్తివంతమైన పానీయం. గ్రీన్ టీలో ముఖ్యంగా పాలీఫెనాల్స్ అనే యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. గ్రీన్ టీ అనగానే సాధారణంగా కొవ్వును కరిగించుకోవటానికి వాడతారు అని తెలుసు. కానీ, గ్రీన్ టీ మన శరీరానికి చాలా రకాలుగా ఉపయోగపడుతుందని, ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గ్రీన్ టీ వల్ల కలిగే ఎక్కువగా అందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ వల్లే వస్తాయి. ఇవి మీ బాడీని ఫ్రీ రాడికల్ డ్యామేజ్ నుండి రక్షిస్తాయి. గ్రీన్ టీ రక్తంలోని చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరిస్తుంది. గ్రీన్ టీకి శరీరంలోని క్రొవ్వు, రక్తపీడనాన్ని తగ్గించే శక్తి వుంది. గ్రీన్ టీ కాంజేస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్ వంటి గుండె సంబంధిత వ్యాధులను రాకుండా ఆపుతుంది. గ్రీన్ టీ త్వరగా బరువు తగ్గటానికి అద్భుతంగా పనిచేస్తుంది. గ్రీన్ టీ తాగటం వల్ల మెదడుకు మంచిది, మతిమరుపు రాకుండా చేస్తుంది. కీళ్లనొప్పులతో బాధపడేవారికి గ్రీన్ టీ చక్కని ఔషధంగా పనిచేస్తుంది. ప్రతి రోజు ఒక కప్పు గ్రీన్ టీ తాగటం వలన ఒత్తిడి నుండి ఉపశమనాన్ని పొందవచ్చు. గ్రీన్ టీలో ఎల్ థయమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఒత్తిడిని కంట్రోల్ చేస్తుంది. రోజుకు ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల ఆందోళన తగ్గుతుంది. గ్రీన్ టీ తాగితే అభిజ్ఞా పనితీరు మెరుగుపడుతుంది. గ్రీన్ టీ తాగడం వల్ల న్యూరోడీజెనరేటివ్ సమస్యలు రావు. అల్జీమర్స్ ప్రమాదం తగ్గుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఎముకలను బలంగా మార్చడంలో గ్రీన్ టీ సహాయపడుతుంది. గ్రీన్ టీ తాగితే ఆస్టియోపోరోసిస్ రిస్క్ తగ్గుతుంది. కీళ్ల నొప్పులు మాయం అవుతాయి. ప్రతిరోజూ గ్రీన్ టీ తాగడం వల్ల జీవితకాలం పెరుగుతుంది. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫాలీ ఫినాల్స్ ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఇవి యాంటీ ఏజింగ్ గుణాలను కలిగి ఉంటాయి. గ్రీన్ టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్ కరుగుతుంది. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను కరిగిస్తాయి. దీంతో హార్ట్ ఎటాక్ రిస్క్ తగ్గుతుంది. క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. గ్రీన్ టీలోని పోషకాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. గ్రీన్ టీ తాగడం వల్ల డయాబెటిస్ రిస్క్ తగ్గుతుంది. గ్రీన్‌టీలోని యాంటీ ఆక్సిడెంట్లు ఇన్సులిన్ ఉత్పత్తిని స్థిరంగా ఉంచుతాయి. గ్రీన్ టీ తాగడం వల్ల వేగంగా, సులభంగా బరువు తగ్గొచ్చు. గ్రీన్‌టీలోని కెటాచిన్లు చెడు కొవ్వును కరిగిస్తాయి. గ్రీన్ టీ తాగితే కేలరీలు వేగంగా బర్న్ అవుతాయి. గ్రీన్ టీ తాగడం వల్ల బీపీ కంట్రోల్ అవుతుంది. గ్రీన్ టీ తాగితే రక్తప్రసరణ బాగా అవుతుంది. దీంతో బీపీ అదుపులోకి వస్తుంది.

# ఉదయాన్నే ఈ రెండు తింటే చాలు.. ఆసుపత్రికి వెళ్లాల్సిన పనే ఉండదంట




మార్కెట్లో వివిధ రకాల ఖరీదైన డ్రై ఫ్రూట్స్ అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో, ఏ డ్రై ఫ్రూట్ మనకు ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందో..? అనే విషయంలో ఎల్లప్పుడూ గందరగోళంగా ఉంటుంది. డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆహారంతో పాటు, మెరుగైన ఆరోగ్యం కోసం ప్రతిరోజూ డ్రై ఫ్రూట్స్ తినడం మంచిదంటున్నారు వైద్య నిపుణులు.. పోషకాలు సమృద్ధిగా ఉన్న డ్రై ఫ్రూట్స్ విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. అందువల్ల, ఉదయం ఖాళీ కడుపుతో దీన్ని తినడం వల్ల శరీరానికి పూర్తి పోషణ లభిస్తుంది.. రోజంతా శక్తిని నిర్వహిస్తుంది. కానీ ఏ డ్రై ఫ్రూట్స్ ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయనే దానిపై ఎల్లప్పుడూ గందరగోళం ఉంటుంది. అన్ని మంచివే అయినప్పటికీ.. బాదం, వాల్‌నట్స్ సూపర్ డ్రై ఫ్రూట్స్ అని నిపుణులు చెబుతున్నారు. బాదం వాల్‌నట్స్ రోజూ తినడం వల్ల మీ మొత్తం ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుతుంది.. ఇవి అనేక వ్యాధుల నుంచి మిమ్మల్ని రక్షిస్తాయి.

బాదం.. బాదం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. పోషకాలు అధికంగా ఉండే బాదంలో విటమిన్ ఇ, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల, ఉదయం దీనిని తినడం వల్ల మీకు పోషకాలు లభిస్తాయి. బాదంను రాత్రిపూట నానబెట్టి ఉదయం తినడం మంచిది. ప్రతిరోజూ 5 నుంచి 6 బాదం తినడం ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. దీని రోజువారీ వినియోగం మెదడు పనితీరు, పదునైన జ్ఞాపకశక్తి.. ఏకాగ్రత శక్తిని మెరుగుపరుస్తుంది. దీనితో పాటు, బాదం మీ గుండెను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది.. శరీరం నుండి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగిస్తుంది.

వాల్‌నట్స్.. వాల్‌నట్స్ మీకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. మెదడు ఆకారంలో ఉండే వాల్‌నట్స్‌లో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి.. ఇవి మీ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. దీనితో పాటు, వాల్‌నట్స్ తినడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో 1 నుండి 2 వాల్‌నట్స్ తినడం మంచిది. దాని శోథ నిరోధక లక్షణాల కారణంగా, ఇది కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.. టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ముఖ్యమైన విషయం ఏంటంటే.. బాదం పప్పులను రాత్రంతా నానబెట్టిన తర్వాత తినడం మంచిది. దీనితో పాటు, ఉదయం బాదంపప్పు తొక్కను తొలగించి తినాలి.. తద్వారా ఎంజైమ్‌లు బాగా సక్రియం చేయబడతాయి. మరోవైపు, వాల్‌నట్‌లను కూడా నానబెట్టిన తర్వాత తింటే, జీర్ణక్రియ పోషణకు మంచిది. దీనితో పాటు, ప్రతిరోజూ 5 నుంచి 6 బాదంపప్పులు.. 1 నుంచి 2 వాల్‌నట్‌లు తినాలి. ఎక్కువగా తినడం వల్ల బరువు పెరగడం లేదా జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి.

# బెల్లీ ఫ్యాట్ తగ్గించుకోవాలని అనుకుంటున్నారా?



నేటి తరంలో అధిక బరువు సమస్య చాలా మందిని వేధిస్తోంది. ఈ వ్యాసం 6 కిలోల బరువు తగ్గడానికి సహాయపడే 6 సమర్థవంతమైన వ్యాయామాలను వివరిస్తుంది. జంపింగ్ జాక్స్, పుష్‌అప్స్, హై నీస్, స్క్వాట్స్, బర్పీస్, మౌంటెన్ క్లైంబర్స్ వంటి వ్యాయామాలు బొడ్డు కొవ్వును తగ్గించి, శరీరారోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. నేటి యుగంలో క్రమరహిత జీవనశైలి, ఆహారపు అలవాట్లు, డెస్క్ ఉద్యోగాలు, అనేక ఇతర కారణాల వల్ల, చిన్న వయస్సులోనే బరువు పెరిగే సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారు. బరువు పెరగడంతో పాటు, చాలా మంది తమ పొట్ట, అంటే బొడ్డు కొవ్వుతో ఇబ్బంది పడుతున్నారు. పెరిగిన బరువు, బొడ్డు కొవ్వును తగ్గించడానికి ప్రజలు వివిధ రకాల నివారణల కోసం వెతుకుతారు. జంపింగ్ జాక్స్: జంపింగ్ జాక్స్ అనేది మొత్తం శరీరం జీవక్రియను వేగవంతం చేసే, కొవ్వును వేగంగా కాల్చే వ్యాయామం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతిరోజూ కేవలం 10 నిమిషాలు జంపింగ్ జాక్స్ వంటి వ్యాయామాలు చేయడం వల్ల 100 నుండి 150 కేలరీలు బర్న్ అవుతాయి. పుష్‌అప్స్: ఫిట్‌నెస్ ట్రైనర్ల ప్రకారం.. పుష్‌అప్ వ్యాయామం ప్రధానంగా బొడ్డు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది ఛాతీ భుజాలను కూడా టోన్ చేస్తుంది. డెస్క్ ఉద్యోగాలు చేసే వ్యక్తులు ప్రధానంగా ప్రతిరోజూ 10 నిమిషాలు పుష్‌అప్ వ్యాయామాలు చేయాలి. ఈ వ్యాయామం చేయడం వల్ల 100 కేలరీలు తగ్గుతాయి. హై నీస్: ఈ వ్యాయామం కడుపు, తొడ కొవ్వును వేగంగా తగ్గిస్తుంది. ప్రతిరోజూ 20 నుండి 25 నిమిషాలు హై మోకాలి వ్యాయామం చేయడం వల్ల 200 నుండి 300 కేలరీలు బర్న్ అవుతాయని నిపుణులు అంటున్నారు. హై మోకాలి వ్యాయామం కార్డియోలో కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. స్క్వాట్స్: స్క్వాట్స్ తొడ, పిరుదులు, కడుపు కొవ్వును తగ్గిస్తాయి. ఈ వ్యాయామం జీవక్రియను వేగవంతం చేస్తుంది, ఇది బొడ్డు కొవ్వును కరిగించడాన్ని సులభతరం చేస్తుంది. రోజుకు 10 నిమిషాలు స్క్వాట్స్ చేయడం వల్ల 150 కేలరీల వరకు తగ్గుతుంది. కానీ స్క్వాట్స్ చేసే ముందు వేడెక్కడం ముఖ్యం అని గుర్తుంచుకోండి. బర్పీస్: బర్పీ వ్యాయామం శరీరం కోర్ బలం, స్టామినాను పెంచుతుంది. ప్రతిరోజూ కేవలం 5 నుండి 7 నిమిషాలు బర్పీ వ్యాయామాలు చేయడం వల్ల 300 కేలరీల వరకు ఖర్చవుతుంది. ఇది కడుపు, తుంటి కొవ్వును తగ్గిస్తుంది. ఇది తక్కువ సమయంలో ఎక్కువ బరువును తగ్గించడంలో సహాయపడుతుంది. మౌంటెన్ క్లైంబర్స్ వ్యాయామం: మౌంటెన్ క్లైంబర్స్ కొవ్వును కరిగించడానికి, కోర్ బలానికి చాలా ప్రయోజనకరంగా ఉంటారు. ఈ వ్యాయామం ప్రధానంగా కడుపు, తొడలు, భుజాలలోని కొవ్వును తగ్గిస్తుంది. పర్వతారోహకులు ప్రతిరోజూ 5 నిమిషాలు వ్యాయామం చేయడం వల్ల 250 కేలరీలు తగ్గుతాయి.



# ఫుడ్ కలర్స్‌తో డేంజర్

నేటి ఆకర్షణీయమైన రంగుల స్వీట్లు, షర్బత్‌లు, ఐస్ క్రీమ్‌లలో ఉపయోగించే కృత్రిమ రంగులు ఆరోగ్యానికి హానికరం. ఐచీA నష్టం, అలెర్జీలు, ఉబ్బసం, థైరాయిడ్ సమస్యలు వంటి తీవ్రమైన సమస్యలకు కారణమవుతాయి. అమెరికాలో ఎనిమిది కృత్రిమ రంగులను నిషేధించారు. ఈ రంగులను నివారించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. నేటి వేగవంతమైన జీవనశైలిలో, ప్రకాశవంతమైన రంగుల స్వీట్లు, షర్బత్‌లు, ఐస్ క్రీమ్‌లు మనల్ని ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. అయితే.. ఇవి చూసేందుకు బాగున్నా, తినేందుకు రుచికరంగా ఉన్నా.. మన ఆరోగ్యానికి మాత్రం చేయాల్సినంత చేటు చేసుకున్నాయి. ముఖ్యంగా ఫుడ్ కలర్ వల్ల మనకు ఎలాంటి నష్టం కలుగుతుందో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. జిలేబీలు, క్యాండీలు, షర్బెట్ లు, ఫ్లేవర్డ్ ఐస్ క్రీంలను తయారు చేయడానికి ఉపయోగించే అనేక సింథటిక్ ఫుడ్ కలర్స్ చాలా ప్రమాదకరమైనవని ఇటీవలి పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ కృత్రిమ రంగులు కంటికి ఇంపుగా, రుచిగా ఉన్నప్పటికీ, ఐచీA నష్టంతో సహా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉన్నాయి. ఈ సింథటిక్ ఫుడ్ కలర్స్ కలిపి ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఐచీA నష్టం, చర్మ అలెర్జీలు, ఉబ్బసం, థైరాయిడ్ అసమతుల్యత, జీర్ణశయాంతర రుగ్మతలు, బలహీనమైన జ్ఞాపకశక్తి, పిల్లలలో హైపర్యాక్టివిటీ వంటి సమస్యలు కలుగుతాయి. ఈ రసాయనాలు శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక శ్రేయస్సును కూడా ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా పెరుగుతున్న పిల్లలలో ఈ ప్రమాదాలను గుర్తించిన యునైటెడ్ స్టేట్స్, మానవ ఆరోగ్యంపై విషపూరిత ప్రభావాన్ని చూపుతున్నందున ఎనిమిది సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను నిషేధించింది. నిషేధిత రంగుల జాబితా ఇదే.. ఎల్లో 5, ఎల్లో 6, రెడ్ 40, రెడ్ 3, రెడ్ 10, బ్లూ 1, బ్లూ 2, గ్రీన్ 3 వంటి కలర్స్ ఉన్నాయి.




# రాత్రిపూట మెంతులను నీటిలో నానబెట్టి ఉదయాన్నే తాగితే...

మెంతుల వల్ల చాలా రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దీనిని అనేక రకాల ఆహార పదార్థాలు, పచ్చళ్లలోనే కాకుండా కేశాల అభివృద్ధికి, సౌందర్యలేపనంగా కూడా దీనిని ఉపయోగిస్తుంటారు. చుండ్రు, జుట్టు రాలడం లాంటి సమస్యలను మెంతులు నివారిస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో రాత్రంతా నీటిలో నానబెట్టిన మెంతి గింజలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మెంతి గింజల నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం తగ్గుతుంది. మెంతి గింజల నీరు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో బాగా పనిచేస్తుంది. మెంతి గింజల నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ప్రాణాంతక గుండె సంబంధిత వ్యాధుల నుండి రక్షిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు మెంతి గింజల నీటిని తీసుకోవడం ద్వారా వారి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చు. విటమిన్లు, ఖని, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే నానబెట్టిన మెంతులు తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మెంతి నీటిని తీసుకోవడం వల్ల బొడ్డు కొవ్వు తగ్గుతుంది. బరువును సులభంగా నియంత్రించడంలో సహాయపడుతుంది. చర్మం, జుట్టు ఆరోగ్యానికి నానబెట్టిన మెంతులను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. మెంతి నీరు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించడం వల్ల హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. జీర్ణక్రియ ఆరోగ్యంగా ఉంటుంది. మెంతి నీళ్లు తాగడం వల్ల జీర్ణ సమస్యలు తొలగిపోతాయి. అలాగే, ఇది అజీర్ణం, ఉబ్బరం సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. మెంతి నీరు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్‌ను నెమ్మదిగా విడుదల చేస్తుంది. దీని కారణంగా చక్కెర స్థాయి అకస్మాత్తుగా పెరగకుండా. అందువల్ల, మెంతి నీరు మధుమేహాన్ని నియంత్రించడంలో, నివారించడంలో కూడా సహాయపడుతుంది. మెంతి నీరు ఋతుస్రావం సమయంలో వచ్చే నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది హార్మోన్లను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. క్రమరహిత ఋతుస్రావ సమస్యను తొలగిస్తుంది. అలాగే, మెంతి నీరు ఋతుస్రావం సమయంలో ఉబ్బరాన్ని తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటుంది. జుట్టు రాలడం, పొడి చర్మానికి సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరిస్తుంది.

# సర్వరోగ నివారిణి.. ఆ సమస్యలకు బ్రహ్మాస్త్రమే..

ప్రకృతి ఎన్నో రకాల సహజ ఔషధ మొక్కలను ప్రసాదించింది.. ఈ మొక్కలు ఎన్నో అనారోగ్య సమస్యలకు దివ్య ఔషధంలా పనిచేస్తాయి. అలాంటి పవర్‌ఫుల్ ఔషధ మొక్కల్లో తిప్పతీగ ఒకటి.. తిప్పతీగతో తిప్పలన్నీ దూరం చేసుకోవచ్చని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు. ప్రకృతి ఎన్నో రకాల సహజ ఔషధ మొక్కలను ప్రసాదించింది.. ఈ మొక్కలు ఎన్నో అనారోగ్య సమస్యలకు దివ్య ఔషధంలా పనిచేస్తాయి.. అలాంటి పవర్‌ఫుల్ ఔషధ మొక్కల్లో తిప్పతీగ ఒకటి.. తిప్పతీగతో తిప్పలన్నీ దూరం చేసుకోవచ్చని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. తిప్పతీగ.. ఆకులు, కాండం, వేర్లు.. అన్ని విలువైనవే.. వీటిలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. దీనిని ఆయుర్వేదంలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. తిప్పతీగతో జ్యూస్, పౌడర్, కాప్సూల్స్ ను తయారు చేస్తారు. తిప్పతీగను ఎలా తీసుకున్నా శరీరానికి మంచిదే.. అందుకే.. తిప్పతీగను తిరుగులేని శక్తివంతమైన ఔషధ మొక్కగా అభివర్ణిస్తారు. తిప్పతీగ రసం తీసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. ఇది శరీరానికి శక్తిని అందించి.. మూలకాలను మెరుగుపరచడానికి, పోషించడానికి సహాయపడుతుంది. అలాగే.. తిప్పతీగలోని ఔషధ గుణాలు.. మధుమేహం, చర్మవ్యాధులు, కీళ్ల వ్యాధులు, నులిపురుగులు, జ్వరం మొదలైన వాటి నుంచి ఉపశమనం కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. తిప్పతీగను రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల చాలా సమస్యలు నయమవుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.. తిప్పతీగను తీసుకోవడం వల్ల కలిగే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలేంటో ఈ కథనంలో తెలుసుకోండి.తిప్పతీగలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలున్నాయి.. ఇవి తరచుగా వచ్చే దగ్గు, జలుబు, టాన్సిలిటిస్ వంటి సాధారణ శ్వాసకోశ సమస్యలతో పోరాడతాయి..

తిప్పతీగ తీసుకోవడం ద్వారా ఉబ్బసం రోగులకు కూడా ఉపశమనం లభిస్తుంది.. ఛాతీ బిగుతుగా ఉండడం, శ్వాస ఆడకపోవడం, దగ్గు, గురక వంటి లక్షణాలను తిప్పతీగ తగ్గించి ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. తిప్పతీగ ఆకులతోపాటు బెల్లం కలిపి తీసుకుంటే.. మలబద్ధకం సమస్య దూరమవుతుంది.. జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది.డయాబెటిస్ కూడా తిప్పతీగ మంచిగా పనిచేస్తుంది. దీని జ్యూస్ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను మెరుగుపరచడం ద్వారా మధుమేహాన్ని నియంత్రిస్తుంది.తిప్పతీగ శరీరంలో రోగ నిరోధకశక్తిని మెరుగుపర్చి అనేక వ్యాధులను నియంత్రిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే.. తిప్పతీగ కషాయాన్ని ఉదయాన్నే తాగితే చాలా మంచిది.. అయితే.. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: హొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# శీతాకాల సమావేశాల తొలి రోజే తీవ్ర ఉద్రిక్తత

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)

పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలిరోజే విపక్షాల ఆందోళనతో లోక్‌సభ అట్టుడికింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వేపై చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. అందుకే లోక్‌సభ స్పీకర్ నిరాకరించడంతో విపక్షసభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో పలు మార్లు లోక్‌సభ వాయిదాపడింది.

నివాళులతో మొదలై నినాదాలతో కొనసాగి.. అంతకుముందు సోమవారం ఉదయం 11 గంటలకు జాతీయగీతం జనగణమనతో లోక్‌సభలో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల మృతిచెందిన మాజీ సభ్యులకు ప్రస్తుత లోక్‌సభ సభ్యులు నివాళిగా సంతాపం తెలిపారు. అనంతరం స్పీకర్ ఓంబిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. వెనువెంటనే కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీసహా పలు విపక్ష పార్టీల ఎంపీలు తమతమ స్థానాల్లోంచి లేచారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర(ఎస్ఐఆర్) సర్వే అంశంపై లోక్‌సభలో చర్చించాలని పట్టుబట్టారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభాకార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో స్పీకర్ ఓంబిర్లా వెంటనే కల్పించుకున్నారు. 'తొలిరోజే సభాకార్యకలాపాలకు అడ్డుతగలడం ఏమాత్రం మంచి పద్ధతి కాదు. సభలో విధానాత్మక, నిర్మాణాత్మక చర్చలు జరగాలి. సభలో సమ్మతి, అసమ్మతి రెండు ఉన్నా, చర్చల ద్వారానే అన్నింటికీ సమాధానం దొరుకుతుంది.

అతిపెద్ద ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్‌ను నినాదాలతో అడ్డుకోకూడదు. ప్రశ్నోత్తరాలు కొనసాగనివ్వండి'' అని స్పీకర్ అన్నారు. అయినప్పటికీ విపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకుండా, ఎస్ఐఆర్‌పై చర్చను కోరుతూ పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదావేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక సైతం విపక్ష సభ్యుల వైఖరితో మార్పు రాలేదు. విపక్షాల ఆందోళన ఎక్కువవడంతో కేవలం 12 నిమిషాల తర్వాత సభ మళ్లీ వాయిదా పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సభ మళ్లీ మొదలైంది.

పొగాకు, పొగాకు ఉత్పత్తులపై ఎక్సయిజ్ డ్యూటీ, పాన్ మసాలాపై కొత్త సెస్ వేసేందుకు ఉద్దేశించిన బిల్లుతోపాటు, సెంట్రల్ ఎక్సయిజ్ (సవరణ) బిల్లు-2025, హెల్త్‌సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు-2025లను ఈలోపే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మణిపూర్‌లో రాష్ట్రపతిపాలన కొనసాగుతుండటంతో మణిపూర్ జీఎస్‌టీ(సవరణ) బిల్లును సైతం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. 2025-26 ఆర్థికసంవత్సర గ్రాంట్లకు సంబంధించిన అనుబంధ పద్దును సైతం సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత సభ మరోసారి వాయిదాపడింది. తర్వాత సభ మొదలైనా విపక్ష సభ్యుల నినాదాలు ఆగలేదు. దీంతో చేసేదిలేక స్పీకర్ మధ్యాహ్నం 2.20 గంటలకు సభను మంగళవారానికి వాయిదావేశారు.

ఎగువసభలోనూ దాదాపు ఇవే దృశ్యాలు కనిపించాయి. ఎస్ఐఆర్‌పై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. ''ఎస్ఐఆర్‌పై చర్చకు ప్రభుత్వం వెనకడుగు వేయట్లేదు. అయితే నిర్ణీత కాలావధిలోపు ఫలానా సమయంలోనే చర్చించాలనే మొండిపట్టును విపక్షాలు విడనాడాలి. ఎస్ఐఆర్‌పై చర్చ అంశంలో కేంద్రానికి మరింత సమయం కావాలి'' అని ఆయన అన్నారు.

మంత్రి సమాధానంతో సంతృప్తిచెందని విపక్ష సభ్యులు వెనువెంటనే రాజ్యసభ నుంచి వాకౌట్‌చేశారు. అంతకుముందు ఎస్ఐఆర్‌సహా పలు అంశాలపై తక్షణం చర్చ జరపాలంటూ తొమ్మిది మంది విపక్ష సభ్యులు వేర్వేరుగా రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు నోటీస్‌లను అందజేశారు. ఉపరాష్ట్రపతిగా ప్రమాణంచేశాక రాజ్యసభ డిప్యూటీచైర్మన్ హోదాలో రాధాకృష్ణన్ సేవలందించడం ఇదేతొలిసారికావడం విశేషం. ఈ సందర్భంగా ఆయనను ప్రధాని మోదీ పొగిడారు.

''సాధారణ కుటుంబం నుంచి వచ్చిన రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదగడం మన ప్రజాస్వామ్యంలోని శక్తికి నిదర్శనం. పలు రాష్ట్రాల్లో కీలక పదవుల్లో సేవచేసి గడించిన అనుభవం రాజ్యసభ సజావుగా సాగేందుకు తోహదపడనుంది'' అని ఆయన అన్నారు.

తర్వాత ఖర్గే మాట్లాడారు. ''గత ఉపరాష్ట్రపతి హఠాత్తుగా రాజీనామాచేయడం అధికార పక్షాన్ని సైతం విస్మయపరిచింది. రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య సమతూకం పాటిస్తూ విపక్ష సభ్యులకు సైతం సమస్యలపై మాట్లాడే అవకాశం కల్పించాలని విజ్ఞప్తిచేస్తున్నా'' అని ఖర్గే అన్నారు.

# కౌలు రైతు వీరన్న మృతిపై హరీశ్‌రావు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)



గిరిజన రైతు వీరన్నది ఆత్మహత్య కాదని. ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం కౌలు రైతులకు ఆత్మీయ భరోసా కింద ఏటా రూ. 15 వేలు ఇస్తామని బాండ్లు రాసిచ్చిన కాంగ్రెస్ నేతలు గద్దెనెక్కగానే మోసం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.

పండించిన పంట కొనే దిక్కులేక, మద్దతు ధర రాక దళారుల దోపిడీకి అన్నదాతలు బలవుతున్నారని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. 'సెల్ఫీ వీడియోలో వీరన్న చెప్పిన మాటలకైనా ఈ మొండి ప్రభుత్వానికి చలనం వస్తుందా? ఇచ్చిన హామీ మేరకు ఆత్మీయ భరోసా ఎప్పుడు ఇస్తరు? మీ సర్కారు నిర్లక్ష్యానికి ఇంకెంతమంది రైతులను బలి తీసుకుంటరు?' అంటూ ప్రశ్నలవర్షం కురిపించారు.

నేడు ఖమ్మం పర్యటనకు వెళ్తున్న ముఖ్యమంత్రి రెడ్డి వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్దని చేతులు జోడించి విన్నవిస్తున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా బీఆర్ఎస్ వెంటపడుతుందని తేల్చిచెప్పారు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ఏ ఒక్క రైతూ అధైర్యపడవద్దని హరీశ్‌రావు విజ్ఞప్తిచేశారు.

# మహిళా సంఘాలకు మరో 448 బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. అవసరమైన అనుమతులు మంజూరైన వెంటనే ఆ బస్సులను ఆర్టీసీకి అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో బస్సు ద్వారా మహిళా సంఘాలకు నెలకు సుమారు రూ.70 వేల వరకు అద్దె ఆదాయం లభిస్తుంది. ప్రస్తుతం నడుస్తున్న 152 బస్సుల నిర్వహణ విజయవంతమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మిగతా 448 బస్సుల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించినట్లు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ప్రకటించారు భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసి, ఎక్కువ సంఖ్యలో మహిళా సంఘాలకు అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఇప్పటి వరకు రాష్ట్రంలో మహిళలు బస్సు టిక్కెట్ చార్జీల రూపంలో రూ. 7,600కోట్లు ఆదా చేసుకున్నారు. సబ్సిడీపై రూ. 500కు గ్యాస్ సిలెండర్‌తో 45 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. మహిళలు సొంతంగా ఆర్టీసీకి బస్సులను అద్దెకు ఇవ్వడంతోపాటు పెట్రోల్ బంకులను నిర్వహించేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. 26 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. కొత్తగా 2,25,110 సంఘాలు రూ.4,825.54 కోట్ల విలువైన వ్యాపారాలను ప్రారంభించాయి. దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. 32 జిల్లాల్లో 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది.

# సీఎం మార్పు వివాదానికి 'విందుల డిప్లొమసీ'

◆ సిద్ధరామయ్య– డీకే మరోసారి ఐక్యత సందేశం



అధికార మార్పిడి వివాదానికి అల్పాహార భేటీ ద్వారా విరామం ప్రకటించి ఐక్యతారాగం పాడిన సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి తమ ఐక్యతను చాటిచెప్పేందుకు సిద్ధమయ్యారు. మూడు రోజుల క్రితం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం సిద్ధరామయ్య తన నివాసంలో అల్పాహార విందు ఇచ్చారు. ఇప్పుడు డీకే వంతు వచ్చింది. సోమవారం విధానసౌధలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో 'తన నివాసంలో భోజన విందుకు' రావాల్సిందిగా సీఎంను డీకే ఆహ్వానించారు. అయితే బ్రేక్‌ఫాస్ట్‌కు వస్తానని సీఎం తెలిపారు. దీంతో సీఎం సిద్ధరామయ్యకు ఇష్టమైన నాటుకోడి పులుసుతో పాటు ఇతరత్రా వంటకాలను ప్రత్యేకంగా డీకే సిద్ధం చేయిస్తున్నారు. కలిసి కూర్చుని మాట్లాడుకోవాలంటూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు ఈ నెల 29న ముఖ్యమంత్రి నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు తామిద్దరం కలసికట్టుగా సాగుతున్నట్లు మీడియాకు వివరించారు. తద్వారా సీఎం మార్పిడి వివాదానికి తాత్కాలికంగా విరామం ప్రకటించారు.

కాగా, సీఎం మార్పుపై కాంగ్రెస్ పార్టీ ఇంకా ఎటూ తేల్చకుండా నాన్చుతోంది. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో పార్టీ నాయకులు బిజీగా ఉండడంతో కర్ణాటక అధికార మార్పిడిపై చర్చించేందుకు అధిష్ఠానం నాయకులు అందుబాటులో లేరని తెలుస్తోంది. ఢిల్లీలో ఆదివారం సోనియా గాంధీ నేతృత్వంలో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కర్ణాటక రాజకీయ పరిస్థితి చర్చకువచ్చింది. సిద్ధరామయ్య, డీకేల కార్యాచరణపై వివరాలను అడిగి తెలుసుకున్న సోనియా జనవరి మొదటి వారంలో పరిశీలిస్తామని ఖర్గేకు తెలిపినట్లు సమాచారం.

ముఖ్యమంత్రి, తాను సోదర సమానులమని, కలసికట్టుగా పనిచేసుకుంటూ ముందుకు సాగుతామని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మాజీ సీఎం దివంగత కెంగల్ హనుమంతయ్య వర్ధంతి సందర్భంగా విధానసౌధలోని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన శివకుమార్ అనంతరం మీడియాతో మాట్లాడారు. తమలో గ్రూపులు మీడియా సృష్టి అన్నారు. రాజకీయ ద్వేషంతోనే కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని నేషనల్ హెరాల్డ్ కేసును ఉదహరిస్తూ ఆయన పేర్కొన్నారు. డీకే ఇస్తున్న విందుకు వెళుతున్నట్లు ఇదే కార్యక్రమం సందర్భంగా సీఎం తెలిపారు. నేషనల్ హెరాల్డ్ కేసుకు ప్రస్తావిస్తూ సోనియా, రాహుల్ గాంధీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సరికాదన్నారు.

## బంగారు తెలంగాణ మాటలకే పరిమితం...
## 2047 విజన్‌తో కొత్త దిశలో రాష్ట్రం: పొన్నం తీవ్ర వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)



చేపట్టిందన్నారు. గతంలో చంద్రబాబు విజన్2020 అంటే.. దేశానికి దిక్సూచిలా తెలంగాణను నిలిపేందుకు తమ ప్రభుత్వం 2047 విజన్‌తో ముందుకెళ్తున్నదన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో 3న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. అభివృద్ధి కోసం రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలు.. కోర్ అర్బన్ రీజియన్, సెమీ అర్బన్ రీజియన్, రూరల్ రీజియన్‌గా విభజించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌ను అతిక్రమించకుండానే ఈ నెల 3న పట్టణ ప్రాంతమైన హుస్నాబాద్‌లో సభ నిర్వహిస్తున్నట్లు మంత్రి పొన్నం స్పష్టం చేశారు. విద్యా ఉపాధి, వ్యవసాయ రంగాలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తారన్నారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉండటం వల్ల తాము ఏర్పాట్లు చేయడం లేదని, ప్రజలే స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని మంత్రి పొన్నం వివరించారు.

# పార్లమెంట్ వద్ద వీధిశునకాన్ని కాపాడిన రేణుకా చౌదరి

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)



శీతాకాల సమా వేశాలకు హాజరయ్యేందుకు పార్లమెంట్‌కు వచ్చిన కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి వెంట కారులో ఒక వీధిశునకాన్ని తీసుకురావడంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా రేణుకా దీటుగా బదులిచ్చారు. సోమవారం ఉదయం ఒక వీధిశునకాన్ని ఆమె కాపాడి ఇంటికి తీసుకొచ్చారు. తర్వాత వెటర్నరీ వైద్యునికి చూపించేందుకు బయల్దేరారు. డ్రైవర్ ఈమెను మార్గమధ్యంలో పార్లమెంట్ వద్ద దింపేసి వెటర్నరీ ఆస్పత్రికి వెళ్తామనుకున్నాడు. ఈలోపే పార్లమెంట్ వద్ద రేణుక కారులో కుక్క ఉండటం చూసి బీజేపీ నేతలు విమర్శలు మొదలెట్టారు. పార్లమెంట్‌లో చర్చించాల్సిన అంశాలు ఎంత ముఖ్యమైనవో కాంగ్రెస్ నేతలకు బోధపడటం లేదు. ఇలా కుక్కలను తీసుకొచ్చి తమాషా చేస్తున్నారు. ఈ అంశాన్ని రాజ్యసభ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లాలి '' అని బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ అన్నారు. దీంతో రేణుకాచౌదరి తీవ్రంగా స్పందించారు. '' ప్రభుత్వానికి అసలు కుక్కలంటే గిట్టదనుకుంటా. జంతువులు సమస్యలు చెప్పుకోలేవు. అయినా ఈ శునకం నా కారులో ఉందికదా. బయటకు రాలేదు. అయినా ఇది చాలా చిన్న కుక్క. ఇవేమీ కరవవు. కరిచే వాళ్లు వేరే ఉన్నారు. వాళ్లు పార్లమెంట్ లోపల ఉన్నారు. వీధిశునకాలను కాపాడకూడదని ఏ చట్టంలో రాసి ఉంది? ''అని రేణుక వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే వెటకారంగా స్పందించారు. '' ఆమె చెప్పింది నిజమే. కుక్కలు అస్సలు కరవవు. విపక్ష సభ్యులు ముఖ్యంగా ఆమె సొంత పార్టీ నేతలే ఇరుసభల్లో హంగామా సృష్టించి కరిచినంత పనిచేస్తారు. పార్లమెంట్‌కు మీరు కుక్కలను వెంట తీసుకొస్తే మేం అధికారాన్ని వెంట తీసుకొస్తాం'' అని అన్నారు.

# హిల్ట్ పాలసీపై అపోహలు అవసరం లేదు

(మొదటి పేజీ తరువాయి)



అప్పగించిందని, బీజేపీ నేతలు అప్పుడెందుకు మాట్లాడలేదని నిలదీశారు. సిరీస్ అనే ఫార్మా కంపెనీకి వంద ఎకరాల భూమిని దారాధత్తం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా.. బీఆర్ఎస్, బీజేపీ కలిసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ కాలుష్యం బారిన పడకూడదన్న ఉద్దేశంతో ఈ పాలసీని తీసుకొచ్చామన్నారు. దీనికి నాచారం ఇండస్ట్రియల్ అసోసియేషన్ మద్దతు తెలిపిందన్నారు. హిల్ట్ పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలు విడుదలైన తర్వాత అభ్యంతరాలుంటే.. తెలియజేయాలని సూచించారు. ఈ పాలసీపై రాహుల్‌కే కాదు.. ఇంకెవరికైనా కేటీఆర్ లేఖలు రాసుకోవచ్చన్నారు. కోడ్ అమలు లేని చోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే తప్పేంటని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ప్రపంచంలోని అత్యుత్తమ వర్సిటీల సహకారంతో మరో రెండు నెలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ప్రారంభించనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇందులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తామని తెలిపారు. కోవాసెంట్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం 500 మంది ఇంజనీర్లతో ప్రారంభమైన కోవాసెంట్ ఇన్నోవేషన్ సెంటర్... 2028 నాటికి 3,000 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని చెప్పారు. 18మంది ఉద్యోగులతో ప్రారంభమైన సిగ్నిటీ సాఫ్ట్‌వేర్ కంపెనీ.. కోవాసెంట్‌గా పేరు మార్చుకుని వేల మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అంటే సిలికాన్ వ్యాలీ, ప్రపంచ ప్రొడక్షన్ సెంటర్ గా చైనాలోని షెంజెన్, క్రమశిక్షణ, సుపరిపాలన కలిగిన దేశంగా సింగపూర్ గురించి చెప్తారని, ఈ మూడు లక్షణాలు కలగలిసిన నగరంగా హైదరాబాద్ రూపొందుతోందని తెలిపారు. కోవాసెంట్ చైర్మన్ సుబ్రమణ్యం, ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, యూకే డిప్యూటీ హైకమిషనర్ గ్యారెత్ వయన్ ఓవేన్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.